సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 129
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | గురువారం 07 మే 2026
Published from Hyderabad, Vijayawada.


## వైద్యారోగ్య శాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

### మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి

### నారాయణఖేడ్ ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక



సంగారెడ్డి,మే6(సాక్ష్యం): ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీని చేపట్టామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు . త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలను వెల్లడిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా, వైద్య, మహిళా సాధికారత, అభివృద్ధి మిగతా 2 లో..



## సీఈసీ నియామకంలో సీజే తొలగింపు కేసు

### విచారణ వాయిదా కుదరదన్న సుప్రీం

న్యూఢిల్లీ,మే6(సాక్ష్యం): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి మిగతా 5 లో..



## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

### బత్తిన కుటుంబ సభ్యుల ప్రకటన

హైదరాబాద్,మే6(సాక్ష్యం): ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అందించే చేప ప్రసాదం పంపిణీ జూన్ 8న ప్రారంభించనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఉబ్బసం, శ్వాస కోస వ్యాధులను వివారించేందుకు మిగతా 5 లో..



## తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్

హైదరాబాద్,మే6(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను మిగతా 5 లో..

# తమిళనాడు అసెంబ్లీ రద్దు

- ఉత్తర్వులు ఇచ్చిన గవర్నర్ విశ్వనాథ్
- నేటి విజయ్ ప్రమాణ స్వీకారం వాయిదా
- తమిళనాట మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఏకమవుతున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు



చెన్నై,మే6(సాక్ష్యం): తమిళనాడులో టీవికే ప్రభుత్వం ఏర్పాటుపై ఓవైపు సస్పెన్స్ కొనసాగుతుండగా, మరోవైపు తమిళనాడు 16వ శాసనసభ (2021-26)ను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకల్ బుధవారంనాడు రద్దు చేశారు. ఈనెల 5 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. బలనిరూపణకు అవసరమైన మద్దతు లేఖలు అందించని కారణంగా విజయ్ పార్టీని కూడా గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేదు. దీంతో నేటి విజయ్ ప్రమాణం రద్దయ్యింది. మరోవైపు మిగతా 5 లో..

# విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

- 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి
- మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన
- పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం
- గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ



చెన్నై,మే6(సాక్ష్యం): టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ మిగతా 5 లో..



# మెట్రో విస్తరిస్తాం

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదించండి

- కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ప్రాజెక్ట్
- ఫేజ్-3కింద ఎయిర్‌పోర్ట్ ఫ్యూచర్ సిటీ కారిడార్
- కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి



న్యూఢిల్లీ,మే6(సాక్ష్యం): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు భేటీ అయిన ఇరువురు నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నట్టు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టాలని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2సమగ్ర మిగతా 2 లో..

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

### సీఎం అభ్యర్థిపై బీజేపీలో సమాలోచనలు

### ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు

కోల్‌కతా,మే6(సాక్ష్యం): పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో మిగతా 5 లో..

# శివధర్ రెడ్డి నియామకం సవాల్

- ప్రభుత్వ సలహాదారుగా మాజీ డిజిపి నియామకం
- స్టే విధించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు
- భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతలు
- గవర్నర్‌తో శివధర్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ



హైదరాబాద్,మే6(సాక్ష్యం): తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం సవాల్ చేస్తూ హైకోర్టులో టి. ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక మిగతా 2 లో..

# అంతా బోగాస్

- రైతు డిక్లరేషన్.. ఓ బోగస్ పత్రం
- రైతులను వంచించిన రేవంత్, రాహుల్
- రైతు భరోసా ఎకరాకు 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు
- రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైంది
- కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్‌కు పిండం పెడితేనే..రైతులకు న్యాయం
- బిఆర్ఎస్ హయాంలో ఠంచనుగా రైతుభరోసా ఇచ్చాం
- రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ విమర్శలు
- రైతులు గుండె ధైర్యం కోల్పోవద్దు..
- ఆత్మహత్యలకు అస్సలు పాల్పడవద్దు
- కాంగ్రెస్ పాలనలో వేయిమంది రైతులు మృతి
- వారందరికీ పదిలక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

వరంగల్,మే6(సాక్ష్యం): రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు మిగతా 5 లో..



# పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

### ఉద్యోగుల సంక్షేమమే ప్రధమ ప్రాధాన్యత

### బదిలీల పక్రియ ఆదర్శంగా నిలిచేలా చేపట్టాలి

### అధికారులను ఆదేశించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్



హైద్రాబాద్,మే6(సాక్ష్యం): ఉద్యోగుల సౌలభ్యం, సమానత్వం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ శాఖ పరిధిలో బదిలీల పక్రియను ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు స్పష్టమైన మిగతా 2 లో..

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

- ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు
- రౌండ్ టేబులు సమావేశంలో కవిత



హైదరాబాద్,మే6(సాక్ష్యం): ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ మిగతా 2 లో..

## సంపాదకీయం

### మమతా బెనర్జీ అహంకారం !

ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్ధంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యుడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరిగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత్త ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి..

వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమీక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు.

# తమిళనాడు అసెంబ్లీ రద్దు

మొదటిపేజీ తరువాయి..

డిఎంకె పార్టీలు అనూహ్యంగా రంగంలోకి దిగాయి. కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చర్చలు మొదలు పెట్టినట్లు సమాచారం. దీంతో వారి బలం 120కి ఉన్నట్లుగా సామాచరం. ఇందులో కాంగ్రెస్, బిజెపిలను దూరం పెట్టాలని



నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈనెల 7న ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ సారథ్యంలోని టీవీకే ఆలోచనగా ఉంది. ఇందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ప్రమాణస్వీకారం మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను విజయ్ కలిశారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కోరారు. అయితే విజయ్ చూపిన సంఖ్యాబలంతో గవర్నర్ సంతృప్తి చెందలేదు. ప్రభుత్వం ఏర్పాటు టీవీకేకు తగినంత సంఖ్యాబలం లేదని భావించిన గవర్నర్ 118 మంది సభ్యులు సమకూరిన తర్వాత రావాలని సూచించినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో టీవీకే 108 చోట్ల గెలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది సభ్యుల బలం సంపాదించలేకపోయింది. డీఎంకేతో పొత్తులో భాగంగా 5 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు మద్దతు ప్రకటించింది. విజయ్ గెలిచిన రెండు సీట్లలో ఒక సీటును మినహాయిస్తే టీవీకే సంఖ్యాబలం 112కు చేరుకుంది. దీంతో మరో ఆరుగురి మద్దతు టీవీకేకు అవసరమైంది. ప్రస్తుతం టీవీకేకు ఎవరు మద్దతు ఇవ్వనున్నారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. విజయ్‌కు మద్దతిచ్చే అవకాశాలను అన్నాడీఎంకే బుధవారంనాడు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఎడప్పాడి పళనిస్వామి నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై టీవీకేకు సపోర్ట్ ఇవ్వరాదని నిర్ణయించారు. డీఎంకే భాగస్వామ్య పార్టీ అయిన వీసీకే మద్దతును టీవీకే కోరినప్పటికీ ఆ పార్టీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వీసీకేకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. టీవీకే ఆహ్వానం అందినప్పటికీ డీఎంకే భాగస్వాములుగా ఉన్న వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లిగ్ పార్టీలు టీవీకేకు సపోర్ట్ నిరాకరించాయి. ఈ పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను కలుసున్నారు. అనంతరం డీఎంకేకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ఆరుగురు ఎమ్మెల్యేల బలాన్ని టీఎంసీ ఎలా కూడగట్టనుందనేది సస్పెన్స్‌గా మారింది.

# విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

మొదటిపేజీ తరువాయి..

ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్గేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# అంతా బోగాస్

మొదటిపేజీ తరువాయి..

ఎప్పుడిస్తారన్నారు. దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు.




కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కమిషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు.

## సీఈసీ నియామకంలో సీజే తొలగింపు కేసు

మొదటిపేజీ తరువాయి..

సభ్యత్వాన్ని తొలగించిన కేసుపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. కాగా ఈ అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున ఈ కేసును కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని కేంద్రం తరఫు వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు. కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరిస్తూ..ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని.. ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేశారు. శబరిమల కేసును అసలు విచారించక పోవడమే మంచిదని మంగళవారం 9మంది న్యాయమూర్తుల ధర్మాసం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన లేవనెత్తారు. ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం వాటిపై విచారణ కొనసాగుతోంది.

## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

ఉచితంగా అందించే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని బత్తిని మృగశిర ట్రస్టు నిర్వాహకులు, దివంగత బత్తిని హరినాథ్ కొడుకు అమర్నాథ్ గౌడ్ తెలిపారు. జూన్ 8వ తేదీన తమ కుటుంబ సభ్యులు చేప ప్రసాదం సేవించిన తర్వాత సాయంత్రం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానానికి తరలించనున్నట్లు తెలిపారు. ముహూర్తం ప్రకారం అదేరోజు రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. చేప ప్రసాదం పంపిణీకి ఇప్పటికే ఫిషరీ డిపా÷-టం÷-మెంట్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, పోలీస్ డిపా÷-టం÷-మెంట్, జీహెచ్ఎంసీ, ప్రభుత్వం పర్మిషన్ తీసుకున్నామని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్, అనిరుధ్ గౌడ్, దుర్గా గౌడ్ మంగళవారం తెలిపారు. సుమారు 180 ఏండ్లకు పైగా చేప ప్రసాదం పంపిణీ జరుగుతోందని, ఎక్కడా ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌తో పాటు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు శతాబ్దాలుగా బత్తిని కుటుంబం చేపప్రసాదం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాశ సంబంధ వ్యాధుల నివారణకు మృగశిర కార్తె ప్రవేశించిన ఘడియల్లో ఓ పదార్థాన్ని చేప ద్వారా నోటిలో వేస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

మొదటిపేజీ తరువాయి..

నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల ఛైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. బ్రహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బండి రమేశ్ నియమితులయ్యారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ ఛైర్మన్: గట్టు తిమ్మప్ప, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్: రఘునాథ్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్: గుంజా రేణుక హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఛైర్మన్: దూడెం వెంకట రమణ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ ఛైర్మన్: చరణ్ కౌశిక్,తెలుగు అకాడమీ ఛైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ, వాషర్ మెన్ – డాక్టర్ అజయ్ కుమార్ గీత కార్మిక – చంద్ర శేఖర్ గౌడ్,పెరిక – గొంగరి వెంకటేశర్లు,మేర – సంగ వెంకట్ రాజం,మున్నూరు కాపు – బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,పద్మశాలి – గూడూరి శ్రీనివాస్,వెలమ – జువ్వాడి నర్సింగ్ రావు ఉన్నారు.



# సర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

## మన ఓట్లను తొలగించేలా చంద్రబాబు దళం కుట్ర

## ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలి: పార్టీ శ్రేణులకు సజ్జల హెచ్చరికలు

అమరావతి,మే6: ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణపై మరింత అప్రమత్తంగా ఉండాలని.. 175 అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు దీనిపై మరింత అవగాహన పెంచుకోవాలని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అందుకు అవసరమైన టెక్నికల్ నాలెడ్జ్‌ను పెంచుకోవాలని సూచించారు. 'ఎస్ఐఆర్ పేరుతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఒక్కో రాష్ట్రంలో 90 లక్షలకు పైగాలో తొలగించడం జరిగింది. మనం వైఎస్సార్సీపీ ఓటర్లు, సానుభూతిపరుల ఓట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.. ఒకసారి ఓటు తొలగిస్తే తిరిగి చేర్చడం ఇబ్బందికరం అని సజ్జల పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ కీలక నేతలతో సజ్జల రామకృష్ణారెడ్డి బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యకులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో–ఆర్డినేషన్), రాష్ట్ర కార్యదర్శులు (కో–ఆర్డినేషన్) మెంబర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ ఓటర్లపై చంద్రబాబు, ఆయన టీమ్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. బీఎల్ఓలపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. కావున మన తరుపున ఉండే బీఎల్ఏలు కూడా సమర్థుడై, బీఎల్వోతో సమన్వయం చేసుకోవాలి. మనం



ఎస్ఐఆర్‌ను అవకాశంగా తీసుకుని మన ఓటర్లను కాపాడుకోవాలి. బీఎల్ఓలు ఇప్పటికే మ్యాపింగ్ చేశారు.. కావున మనం ఏర్పాటుచేసుకున్న బీఎల్ఏలు కూడా అందుకు సన్నద్ధంగా ఉండాలి. ఎస్ఐఆర్ మొదలయ్యేలోగా మనం అందుకు అవసరమైన విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. బీఎల్ఏలు సాంకేతికపరంగా ఎక్స్‌పర్ట్ అయి ఉండి అందరితో సమన్వయం చేసుకోవాలి. పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ సిద్ధంగా ఉంటుంది. బీఎల్ఏలకు అవసరమైన ఓరియెంటేషన్ కూడా ఇద్దాం. మనం నిరంతరం దీనిపై దృష్టిపెడితే సార్వత్రిక ఎన్నికలను సులువుగా గెలవచ్చు. అంతేకాక స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనం విజయం సాధించవచ్చు. ఎస్ఐఆర్ పై చర్చ అనంతరం రాష్ట్రంలో రైతులకు సంబంధించి ఈ వారంలో వచ్చేవారం ఆసుపత్రుల సందర్శన, ఆరోగ్యశ్రీ నిర్వీర్యం వంటి కార్యక్రమాలను మనం షెడ్యూల్ చేసుకున్నాం. అందరితో సమన్వయం చేసుకుని ముందుకెళ్ళాలి. కమిటీల వెరిఫికేషన్ ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా నడుస్తోంది, మీరు మరింత వేగవంతం చేయాలి. అందుకు అవసరమైన సపోర్టింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలి. మనకు సంబంధించి ప్రతి కార్యక్రమం కూడా మీడియాలో, సోషల్ మీడియాలో హైలెట్ చేసుకోవాలి. మన ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచి, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజల్లో ఎండగట్టాలి. చంద్రబాబు ప్రభుత్వ దోపిడీ, ఉన్మాదం, అవినీతి, రెడ్ బుక్ పాలనపై కూడా నియోజకవర్గాల్లో మీరు కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాలి. ఈ విషయంలో జిల్లా అధ్యక్షులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో మాట్లాడిన కన్నబాబు, లేళ్ళ అప్పిరెడ్డి, వరికూటి అశోక్ బాబు, అబ్బయ్య చౌదరి, కొరుముట్ల శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మల్లాది విష్ణు ఎస్ఐఆర్‌పై తమకు ఉన్న అవగాహన, అనుమానాలపై చర్చించి పార్టీ క్యాడర్ అంతా అప్రమత్తంగా ఉండాలని, ఎస్ఐఆర్ పూర్తయ్యేవరకు ఏ మాత్రం అజాగ్రత్త లేకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు.

## ధర్మవరంలో ఏటీఎంను ఎత్తుకెళ్లిన దొంగలు

ధర్మవరం,మే6: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో దొంగలు రెచ్చిపోయారు. పార్థసారథి నగర్‌లో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ బ్యాంకు ఏటీఎంను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున బొలెరో వాహనంలో వచ్చిన ముగ్గురు దొంగలు మాస్కులు ధరించి ఏటీఎంలోకి చొరబడ్డారు. రాడ్లతో దానిని పెకిలించడానికి ప్రయత్నించారు. ఎంతకీ రాకపోవడంతో తాళ్లు కట్టి బొలెరో వాహనంతో గట్టిగా లాగారు. ఏటీఎంను వాహనంలోకి ఎక్కించి పరారయ్యారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దొంగలు వాహనంలో బత్తలపల్లి వైపు వెళ్లినట్లు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆ మార్గంలో తనిఖీలు చేపట్టారు.

## ప్రజాసంక్షేమం లక్ష్యంగా టిడిపి పాలన

### మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ఒంగోలు,మే6: ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం కోసం టీడీపీ పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. జగన్ చేసిన మోసాన్ని వైసీపీ నేతలే స్వయంగా ఒప్పుకున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విలువలు లేని పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు. బుధవారం ఒంగోలులో టీడీపీ పార్లమెంట్ నూతన భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఉమ్మడి జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు.దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు వేసిన పునాదులతో 44 ఏళ్ల నుంచి టీడీపీ జెండా రెపరెపలాడుతోందని మంత్రి ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ చంద్రబాబు, లోకేశ్ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

### 17వ ఎస్ఐపీబీ సమావేశంలో చంద్రబాబు

అమరావతి,మే6: రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 17వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు 39 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. విశాఖపట్నంలో రిలయన్స్ సంస్థ రూ.1 లక్ష కోట్లతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. కడపలో అదానీ సంస్థ రూ.12 వేల కోట్లతో హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును చేపట్టనుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టులకు నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## పాపికొండలు యాత్రకు తాత్కాలిక బ్రేక్

రాజమండ్రి,మే6: రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు సూచన చేశారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండలు విహారయాత్ర' ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండలు యాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతనే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్తగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## అమరావతి పేరుతో బాబు దుబారా

### కలెక్టరేట్ ముందు చింతా ధర్నా

కాకినాడ,మే6: కాకినాడ కలెక్టరేట్ వద్ద మాజీ ఎంపీ చింతా మోహన్ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిని ఎంత మంది ప్రజలు కోరుకుంటున్నారని చంద్రబాబును అడుగుతున్నా? అంటూ నిలదీశారు. కాసేపు అమరావతి దేవతల రాజధాని అంటాడు. మరికాసేపు మనుషుల రాజధాని అంటాడు. రేపు ఏ రాజధాని అంటాడో తెలియదు' అంటూ చింతా మోహన్ మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలో కర్ర తుమ్మలు కొట్టడానికే రూ.40–50 కోట్లు ఖర్చు చేశారు. సచివాలయం భవనాలకు అద్దాలను బిగించేందుకు రూ.2 వేల కోట్లు ఖర్చు చేయడం అవసరమా చంద్రబాబు?. రాష్ట్రం అప్పుల్లో ఉంది.. చంద్రబాబు చాలా తప్పులు చేస్తున్నాడు. సచివాలయానికి రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఒంగోలు నుండి కూడా ఒక్కరు రావడం లేదు. రాజధానిని చంద్రబాబు తన సొంత ఆలోచనతో చేసుకుంటున్నాడు' అంటూ చింతా మోహన్ ధ్వజమెత్తారు.

## నెల్లూరులో మహానాడుకు భారీగా ఏర్పాట్లు

### మహానాధు సభాస్థలి వద్ద మంత్రుల భూమిపూజ

నెల్లూరు,మే6: ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు తెలుగుదేశం మహానాడు నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేయనున్నారు.కోవూరు నియోజకవర్గం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో మహానాడు ఏర్పాట్లకు వైభవంగా భూమి పూజ జరిగింది. ఏపీతో పాటు పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, నేతలు, శ్రేణులు తరలి రానున్నారు. భూమి పూజలో ఎంపీ వేమిరెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణ, నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు రాష్ట్ర నేతలందరూ జిల్లాలోనే ఉంటారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. భవిష్యత్తుతరాలకు ఉపయోగపడేలా తీర్మానాలు ఉంటాయన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ ఉంటుందని వెల్లడించారు. బహిరంగసభకు 7 లక్షలకు పైగా కార్యకర్తలు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. నెల్లూరులో మొదటిసారి మహానాడు నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 2200 ఎకరాల స్థలం ఉందని.. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు. పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తోందన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. అందర్నీ సమన్వయం చేస్తూ, సమష్టి కృషితో మహానాడును విజయవంతం చేస్తామని మంత్రి వెల్లడించారు.'మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గత ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తామే గెలుస్తామంటూ ప్రగల్భాలు పలికారు. ఒక్క స్థానంలోనూ వైసీపీని గెలిపించలేక పోయారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈసారైనా కనీసం ఒక స్థానాన్ని గెలిపించే దమ్ము నీకుందా?.. దమ్ముంటే గెలిపించి చూపించు' అంటూ కాకాణికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సవాల్ విసిరారు.

## బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి

### పట్టణంలో అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా

### మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ

మచిలీపట్నం,మే6: బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లు మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బుధవారం బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎం రోడ్డు





పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బందరులోని ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆరోపణలు, విమర్శలు తప్ప మాజీ మంత్రి పేర్నినానికి బందరు అభివృద్ధి పట్టదని విమర్శించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే తొక్కి పడేస్తామని కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. గతంలో రోడ్లను కూడా పట్టించుకోలేదని వైసీపీపై మంత్రి విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు లేని మచిలీపట్నాన్ని సాకారం చేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.28 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. గతంలో ఎంపీగా పని చేసిన కొనకళ్ల నారాయణ రావు, ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో కేంద్రం నుంచి నిధులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూర్చి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో ఇనుము దొంగిలించేశారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు చూపించమంటే తేలుకుట్టిన దొంగల్లా పారిపోతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో పెట్టిన ఇనుము పాడైపోతుంటే.. దాన్ని వేరే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించడం లో తప్పేముందని ప్రశ్నించారు. తప్పు జరిగితే ఫిర్యాదు చేయాలని.. కానీ అధికారులను బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2014–19 మధ్య పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ఐదేళ్లు లబ్దిదారులకు అందకుండా పాడుబెట్టారని మంత్రి ఆరోపించారు. కరగ్రహారం లే అవుట్ పేరుతో వైసీపీ నాయకులు పేదల భూములను తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి అధిక ధరకు అమ్మి లాభాలు పొందారని వ్యాఖ్యానించారు. ఇళ్లు కట్టుకోవడానికి కూడా పనికిరాని ప్రాంతాల్లో భూ కేటాయింపుల పేరుతో దోచుకున్నారని ÷ర్ అయ్యారు. ఆ లే అవుట్లలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని పేర్ని నాని, జగన్ రెడ్డిని ప్రశ్నించారు. పేర్నినాని రోజూ మీడియా ముందుకు వచ్చి చెత్త ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధి కోసం ఒక్క ఆలోచన కూడా చేయలేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమ

తిరుపతి,మే6: శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి



మాట్లాడుతూ.. క్యారియర్ ఏసీ తయారీ కేంద్రం భారతదేశంలోని తమ ఉత్పత్తుల్లో 80 శాతం శ్రీసిటీలో నుంచి సరఫరా చేయబోతోందని తెలిపారు. కుటుంబంలో తల్లి ప్రేమ ముందు.. ఓ తండ్రి చేసే త్యాగాలు పిల్లల కంటికి తెలియదన్నారు. అలాగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి చేసిన కృషిని కొందరు సరిగ్గా అర్థం చేసుకోరని.. అయినా కూడా ఆయన అనుకున్నది సాధిస్తారని చెప్పుకొచ్చారు. పారిశ్రామికవేత్తలకు ఏ రకమైన సేవలైనా ఒక్క వాట్సాప్ మేసేజ్‌తో చేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. శ్రీసిటీలో 70 వేల మంది ఉద్యోగుల్లో 35 వేల మంది మహిళలు ఉన్నారని.. శ్రీశక్తికి ఇది నిదర్శనమన్నారు. శ్రీసిటీలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరులోపు ఏఐ ద్వారా నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టబోతున్నామని లోకేశ్ వెల్లడించారు. శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ సంస్థ వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు 40 ఎకరాల స్థలం కేటాయించారు. ఒకటి, రెండు టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలే కాకుండా భారీ పారిశ్రామిక సముదాయాలకు వినియోగించే 1000 టన్నుల నుంచి 5000 టన్నుల సామర్థ్యం కలిగిన కూలింగ్ సిస్టమ్స్‌ను క్యారియర్ సంస్థ తయారుచేయనుంది. ఉదయం సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడకు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ మంత్రి ఆత్మీయంగా పలకరించి ఫొటోలు దిగారు. శ్రీసిటీలో శంకుస్థాపన అనంతరం మంత్రి లోకేశ్ తిరిగి ఉండవల్లికి వెళ్లనున్నారు.

## ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం.. విధులకు ఏళ్లుగా గైర్హాజరు

### 51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం

### క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్

అమరావతి,మే6: ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర



ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్–1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. . త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటువంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది. వైద్య సేవలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల పక్రియను సంక్షేమ శాఖ పరిధిలో పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా అమలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆశ్రమ పాఠశాలలు, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, దివ్యాంగుల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దూర ప్రాంతాల్లో దీర్ఘకాలం చాలా సేవలందించిన ఉద్యోగులకు వారు కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు, దంపతులు ఒకే చోట పనిచేసే 'స్పౌస్ కేసులు' వంటి అంశాలను సానుకూలంగా పరిగణించాలని ఆదేశించారు. దుర్భర పరిస్థితుల్లో విధులు నిర్వహించిన వారికి మానవీయ దృక్పథంతో న్యాయం చేయాలని పేర్కొన్నారు. బదిలీలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి వాటిని ఉద్యోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి దశలో డిజిటల్ పద్ధతులను వినియోగించి మానవ జోక్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వేగంగా స్పందించాలని ఆదేశించారు. ఎలాంటి ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత ప్రభావాలు లేకుండా నిష్పాక్షికంగా పక్రియ కొనసాగించాలని స్పష్టం చేశారు. గురుకుల సంస్థల్లో బోధన నాణ్యత దెబ్బతినకుండా అవసరమైన సిబ్బంది సమతుల్యతను కాపాడాలని చెప్పారు. మహిళా ఉద్యోగులు, దివ్యాంగులు, సీనియర్ ఉద్యోగులకు ప్రత్యేక సౌలభ్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గురుకులాల్లో అమలు చేసిన 370 జీవో కారణంగా ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 190 జీవో జారీ చేసినప్పటికీ అమలులో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ?ఉక్ష 190 జీవో అమలు సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించి అమలు చేసేలా కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు అన్యాయం జరగకుండా సమతుల్య నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉద్యోగులు సంతృప్తిగా, మనశ్శాంతితో పనిచేసే వాతావరణం కల్పించడం ద్వారా బోధనలో నాణ్యత మరింత మెరుగవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సంక్షేమ శాఖలో బదిలీల పక్రియను ఆదర్శంగా నిలిచే విధంగా నిర్వహించాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# శివధర్ రెడ్డి నియామకం సవాల్

డీజీపీ నియామకంపై గతంలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా కొత్త అప్లికేషన్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చీఫ్ సెక్రటరీ ర్యాంకులో ఆయనను నియమించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు. శివధర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపిఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన స్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్సర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి శ్రీమతి బి. సుమతి, ఐ జి పి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ, పోలీసు విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మెట్రో విస్తరిస్తాం

ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్–2, మెట్రో ఫేజ్–3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్–1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్–2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం ? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా



ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్–3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్–ఎఎ కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యారోగ్య శాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యకరణ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో స్థానిక శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా బాల సదనాలను, అంగన్వాడీలను కాపాడుకునే గురుతర బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో అంగన్వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వ, సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణీ, బాలింతలకు, 3 నుండి 6 ఏండ్ల పిల్లలకి ఒక పూట సంపూర్ణ భోజనం, ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు టేక్ హోమ్ రేషన్ అందించడం, మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లలకి పూర్వ ప్రాథమిక విద్య అందించడంతోపాటు పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ – స్కూలు, రోగ నిరోధకత, రిఫరల్ సేవలు, ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తల సేవలను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీరి సేవలను మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న బాలసదనం బాలికలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్ఓ ప్లాంట్ ని ఏర్పాటు చేయాలని మంత్రి



ఆదేశించారు. రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారోత్సవాలలో జిల్లాలో చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ శుభ్రత, 18 సంవత్సరాల పైబడిన సిసిఐ పిల్లలను గుర్తించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించుట, అత్యవసర సర్టిఫికెట్లు ఆరోగ్య కార్డుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, సంస్థల నుండి పిల్లలను బయటికి డిశ్చార్జి చేసి తిరిగి వారికి పునరావాస కల్పించుట మరియు ఫాలో అప్ పక్రియ, రెసిడెన్షియల్ స్కూల్స్ లో చేర్పు పక్రియ ఇలాంటి అంశాలను జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా.సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్, సుజాత, ఆశ్రమ నిర్వాహకురాలు విజయ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాద్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం



ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.


## నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్

NORTHERN ARC

ప్రధాన కార్యాలయం : 10వ అంతస్తు, ఫేజ్-I, IIT-మద్రాస్ రీసెర్చ్ పార్క్, కనగం విలేజ్, తారామణి, చెన్నై - 600113, తమిళనాడు.

**అనుబంధం-V ఇ-వేలం అమ్మకపు నోటీసు (రూల్ 8(6) నిబంధన ప్రకారం)**

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం బ్యాంకుకు ఛార్జ్ చేయబడిన స్థిరాస్తుల అమ్మకం**

దిగువ సంతకందారు నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(4) ప్రకారం ఈ క్రింది ఆస్తి/ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. నార్తర్న్ ఏఆర్‌సి యొక్క బకాయిలను వసూలు చేయడానికి క్రింద పేర్కొన్న సందర్భాలలో SARFAESI చట్టం ప్రకారం ఛార్జ్ చేయబడిన ఆస్తి/ఆస్తుల ఇ-వేలం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా"మరియు "ఉన్నది ఉన్నట్లుగా" ఇక్కడ పేర్కొన్న నిబంధనలు మరియు షరతులపై నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయబడుతుంది.

| రుణగ్రహీత(లు)/గ్యారంటర్(లు) పేరు | అమ్మకానికి ఉంచిన ఆస్తి/లు వాటి రికవరీకి చెల్లించాల్సిన బకాయిలు |
|---|---|
| 1. M/S. శ్రీ సాయి బాబా కమ్యూనికేషన్స్ 2. శ్రీ వెల్దండి నర్సింహరాములు 3. శ్రీమతి వెల్దండి జమున | రూ. 37,28,524/- మరియు 8 మే, 2025 నుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు |

అమ్మకపు వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి:-

| రిజర్వ్ ధర | బిడ్ మరియు EMD సమర్పించడానికి చివరి తేదీ (రిజర్వ్ ధరలో 10%) | బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్ | ఇ-వేలం అమ్మకం తేదీ మరియు సమయం |
|---|---|---|---|
| రూ. 32,38,245/- (రూపాయలు ముప్పై రెండు లక్షల ముప్పై ఎనిమిది వేల రెండు వందల నలభై ఐదు మాత్రమే) | 16 మే, 2026 రూ. 3,23,824/- (రూపాయలు మూడు లక్షల ఇరవై మూడు వేల ఎనిమిది వందల ఇరవై నాలుగు మాత్రమే) | రూ. 25,000/- | 18 మే, 2026 సమయం ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు |

**ఆస్తి వివరాలు:** రంగాపురం రెవెన్యూ గ్రామం, మొగుళ్ళపల్లి మండలం, జయశంకర్ భూపాలపల్లి మరియు రిజిస్ట్రేషన్ జిల్లా జయశంకర్ మరియు సబ్-రిజిస్ట్రార్, భూపాలపల్లి వద్ద విస్తీర్ణం 410.11 చ.గజాలు లేదా 342.90 చ. మీటర్లు, ప్లింత్ ఏరియా 747.00 చ.అడుగులు కలిగి ఉన్న ఇంటి నం. 4113 యొక్క ఓపెన్ ప్లేస్‌తో కూడిన ఇంటి యొక్క యావత్తు. **సరిహద్దులుగా: తూర్పు:** డోనర్ యొక్క ఓపెన్ ప్లాట్, **పడమర:** సిసి రోడ్డు, **ఉత్తరం:** డోనర్ యొక్క ఇల్లు, **దక్షిణం:** పి. చంద్రయ్య యొక్క ఓపెన్ ప్లాట్

అమ్మకపు వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి:-

| రిజర్వ్ ధర | బిడ్ మరియు EMD సమర్పించడానికి చివరి తేదీ (రిజర్వ్ ధరలో 10%) | బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్ | ఇ-వేలం అమ్మకం తేదీ మరియు సమయం |
|---|---|---|---|
| రూ. 13,62,909/- (రూపాయలు పదమూడు లక్షల అరవై రెండు వేల తొమ్మిది వందల తొమ్మిది మాత్రమే) | 16 మే, 2026 రూ. 1,36,290/- (రూపాయలు ఒక లక్షా ముప్పై ఆరు వేల రెండు వందల తొంభై మాత్రమే) | రూ. 25,000/- | 18 మే, 2026 సమయం ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు |

**ఆస్తి వివరాలు:** హనుమకొండ జిల్లా; పరకాల మున్సిపాలిటీ పరిధిలో మరియు జయశంకర్ రిజిస్ట్రేషన్ జిల్లా, పరకాల సబ్-రిజిస్ట్రార్ పరిధిలో, మాదారం రెవెన్యూ శివారు, పరకాల మండలం, వద్ద విస్తీర్ణం 55.6 చదరపు గజాలు లేదా 42.406 చదరపు మీటర్లు, ప్లింత్ ఏరియా 361.80 చదరపు అడుగుల తో కలిపి; ఎస్‌కె నం. 611; ఇం.నం. 3-1005 గల ఓపెన్ ప్లేస్‌తో కూడిన ఇంటి యొక్క యావత్తు, **సరిహద్దులు: తూర్పు:** పాలకూరి సదానందం గారి ఇల్లు; **పడమర:** మున్సిపాలిటీ రోడ్డు; **ఉత్తరం:** క్యాతం కోటయ్య గారి ఇల్లు ఉమ్మడి గోడ, ఇం.నం. 3-1004; **దక్షిణం:** కొత్తగట్టు విశాలాక్షి గారి ఇల్లు ఉమ్మడి గోడ, ఇం.నం. 3-1006.

**ఆస్తి తనిఖీ తేదీ & సమయం :- 12 మే 2026 ఉదయం 11:00 నుండి సాయంత్రం 5:00 వరకు** మరియు **అధీకృత అధికారి శ్రీ సునీల్ వర్మ 9987030148 కు కాల్ చేసి అనుమతి పొందినట్లయితే.**

**ఇ-వేలం నిబంధనలు మరియు షరతులు క్రింది విధంగా ఉన్నాయి:**

1. ఈ-వేలం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా"మరియు "ఉన్నది ఉన్నట్లుగా" అనే ప్రాతిపదికన నిర్వహించబడుతోంది మరియు "ఆన్‌లైన్"లో నిర్వహించబడుతుంది. ఈ వేలం **నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్** ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ **M/s. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఆక్షన్ టైగర్ అహ్మదాబాద్** ద్వారా నిర్వహించబడుతుంది (సంప్రదించాల్సిన వ్యక్తి: - శ్రీ రామ్ శర్మ సెల్ నం. 800002397, ఇమెయిల్ ramprasad@auctiontiger.net & (సంప్రదించాల్సిన వ్యక్తి - శ్రీ సునీల్ వర్మ సెల్ 9987030148 ఇమెయిల్ sunil.verma@northernarc.com, శ్రీ రమేష్ రావు 8978284555, మరియు సమీర్ సుకే సెల్ 9152910835 ఇమెయిల్ Sameer.suke@northernarc.com వెబ్ పోర్టల్ (http://sarfaesi.auctiontiger.net)లో. ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారమ్‌ను కలిగి ఉన్న ఇ-వేలం టెండర్ డాక్యుమెంట్ http://sarfaesi.auctiontiger.net వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంది.
2. ఉద్దేశించిన కొనుగోలుదారులు / బిడ్డర్లు ఇఎండి మొత్తాన్ని NEFT/RTGS ద్వారా **ఖాతా నంబర్ 65252037994, నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** & IFSC కోడ్: **SBIN0009930**లో డిపాజిట్ చేయాలి లేదా నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్ పేరుతో ఏదైనా జాతీయ బ్యాంక్ లేదా షెడ్యూల్డ్ బ్యాంక్ ద్వారా డిమాండ్ డ్రాఫ్ట్ సమర్పించాలి.
3. బిడ్డర్లు చెల్లుబాటు అయ్యే ఇమెయిల్ ఐడిని కలిగి ఉండాలి {ఇ-మెయిల్ ఐడి ఉద్దేశించిన బిడ్డర్‌కు ఖచ్చితంగా అవసరం ఎందుకంటే అన్ని సంబంధిత సమాచారం మరియు ID & పాస్‌వర్డ్ కేటాయింపును ఇమెయిల్ ద్వారా తెలియజేయడం జరుగుతుంది}.
4. ఉద్దేశించిన బిడ్డర్ ఇఎండి డిపాజిట్ కోసం ఆధారాలను యుటిఆర్ నంబర్‌తో పాటు ఇ-వేలంలో పాల్గొనడానికి అభ్యర్థన లేఖ, వాటి స్వీయ-ధృవీకరించబడిన కాపీలు (i) గుర్తింపు రుజువు (కేవైసి) అంటే ఓటరు ఐడి కార్డ్/ డ్రైవింగ్ లైసెన్స్/ పాస్‌పోర్ట్ మొదలైనవి (ii) కమ్యూనికేషన్ కోసం ప్రస్తుత చిరునామా-ప్రూఫ్, (iii) బిడ్డర్ యొక్క పాన్ కార్డ్, (iv) చెల్లుబాటు అయ్యే ఇ-మెయిల్ ఐడి, (v) బిడ్డర్ యొక్క కాంటాక్ట్ నంబర్ (మొబైల్/ల్యాండ్‌లైన్) మొదలైన వాటిని **12 మే 2026 ఉ॥ 11:00 గం॥ల నుండి మ॥ 02:00 గం॥ల వరకు వరకు నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్‌కు** సమర్పించాలి. ఈ పత్రాల యొక్క ఒరిజినల్ స్కాన్ చేసిన కాపీలను **నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్** యొక్క ఈ-మెయిల్ ఐడికి కూడా సమర్పించవచ్చు.
5. ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనడానికి అర్హత కలిగిన బిడ్డర్ల పేర్లను **నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్** పోర్టల్‌లో గుర్తిస్తుంది, **http://sarfaesi.auctiontiger.net** (ఆక్షన్ టైగర్) అర్హత కలిగిన బిడ్డర్ల పాన్ ధృవీకరణ తర్వాత వినియోగదారు ఐడి పాస్‌వర్డ్‌ను అందిస్తుంది.
6. బిడ్ సమర్పించే ముందు ఆస్తిని తనిఖీ చేసి, తమను తాము సంతృప్తి పరచుకోవడం ఆసక్తిగల బిడ్డర్ల బాధ్యత.
7. పైన పేర్కొన్న ఆస్తుల ఇ-వేలం/బిడ్డింగ్ సరిగ్గా షెడ్యూల్ చేయబడిన తేదీ & సమయంలో నిర్వహించబడుతుంది. బిడ్డర్ ఆస్తిపై "బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్" కాలమ్ కింద పేర్కొన్న మొత్తానికి గుణింతంగా వారి ఆఫర్‌ను మెరుగుపరచుకోవాలి. ఇ-వేలం ముగింపు సమయం యొక్క చివరి 5 నిమిషాలలో బిడ్ వేయబడితే, ముగింపు సమయం స్వయంచాలకంగా 5 నిమిషాలు పొడిగించబడుతుంది. ఇ-వేలం ప్రక్రియ ముగిసిన తర్వాత అత్యధిక బిడ్ మొత్తాన్ని (రిజర్వ్ ధర కంటే తక్కువ కాదు) సమర్పించిన బిడ్డర్‌ను విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటిస్తారు మరియు దానికి సంబంధించిన కమ్యూనికేషన్ ఎలక్ట్రానిక్ మోడ్ ద్వారా జారీ చేయబడుతుంది, ఇది **నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్** / సెక్యూర్డ్ క్రెడిటర్ ఆమోదానికి లోబడి ఉంటుంది.
8. విజయవంతమైన బిడ్డర్ యొక్క ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఇఎండి) పాక్షిక అమ్మకపు పరిగణన కోసం ఉంచబడుతుంది మరియు విజయవంతం కాని బిడ్డర్లకు ఇఎండి తిరిగి ఇవ్వబడుతుంది.
9. అమ్మకపు నిర్ధారణ/అమ్మకపు ధృవీకరణ పత్రం కొనుగోలుదారు(లు) / దరఖాస్తుదారు(లు) పేరు మీద మాత్రమే జారీ చేయబడుతుంది మరియు మరే ఇతర పేరు(లు) లో జారీ చేయబడదు.

సం/-

తేది : 5 మే, 2026 అధీకృత అధికారి

ప్రదేశం: వరంగల్ నార్తర్న్ ఏఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్ కొరకు



## బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

BAJAJ FINANCE

**రిజిష్టర్డ్ ఆఫీస్:** బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, C/o బజాజ్ ఆటో లిమిటెడ్ కాంప్లెక్స్ ముంబాయి పుణే రోడ్ ఆకుర్తి పుణే 411035
**బ్రాంచ్ ఆఫీస్:** బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, 2వ అంతస్తు, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, జడ్చర్ల, తెలంగాణ

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు**

దిగువ సంతకందారు M/s బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా ఈ నోటీసు ద్వారా రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనందున, అంటే బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు వారికి మంజూరు చేసిన కొన్ని రుణం(లు)/రుణాలు /ఆస్తిపై రుణం పైన అసలు మొత్తం, వడ్డీ మరియు ఇతర ఛార్జీలను చెల్లించడంలో డిఫాల్ట్ అయ్యారు. ఈ కారణంగా ఆ రుణాలు "నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్" (ఎన్.పి.ఏ.గా) వర్గీకరించబడ్డాయి.కాబట్టి రుణగ్రహీతలు సహ-రుణగ్రహీతలకు ఈ క్రింది నోటీసును ఇవ్వడం జరిగింది. దీని ప్రకారం,సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని నిబంధనలలోని సెక్షన్ 13(2) కింద వారి చివరి చిరునామాలకు నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి అందించబడకుండా/బట్వాడా చేయబడకుండా తిరిగి ఇవ్వబడ్డాయి, కాబట్టి రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు ఎప్పటికప్పుడు పొందిన రుణ సౌకర్యాల కింద వారి బకాయిలను క్లియర్ చేయాలని ఈ ప్రచురణ నోటీసు ద్వారా వారికి తెలియజేయబడింది.

| లోన్ అకౌంట్ నం./రుణగ్రహీత(లు)/ తనఖాదారు(లు), గ్యారంటర్(లు) పేరు & చిరునామా | సెక్యూర్డ్ స్థిరాస్తి వివరణ | డిమాండ్ నోటీసు తేదీ & అమౌంట్ |
|---|---|---|
| **1 LAN : PM60PBS10686737** 1. **సాయి రాం ఏజెన్సీస్ దాని ప్రొప్రైటర్ అరవీటి కుమారి వసంత,** నివాసం. 1-3/1, జడ్చర్ల, గాంధీనగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, తెలంగాణ-509301, కాంటాక్ట్: 9704371547, ఇమెయిల్ ఐడి: sairam@gmail.com **ఇక్కడ కూడా,** నివాసం ఇం.నం. 1-3/1, 1-3/2 & 1-3/3, బ్లాక్ నం.1, అసెస్‌మెంట్ నం. 1193000004, 1193000005, 1193000006, బడేపల్లి (గ్రామం & మున్సిపాలిటీ) జడ్చర్ల (మండలం), మహబూబ్‌నగర్ (జిల్లా), తెలంగాణ 509301. **2. మారం బాలకృష్ణ** తండ్రి మారం బిక్షమయ్య నివాసం. 1-62, బడేపల్లి, జడ్చర్ల, మహబూబ్‌నగర్ 509301, మహబూబ్‌నగర్, తెలంగాణ, కాంటాక్ట్: 9704371547, ఇమెయిల్ ఐడి: sairamagencies.26084@gmail.com, **ఇక్కడ కూడా,** నివాసం. 4-8-300/165, శుభోదయ కాలనీ, హయత్ నగర్, రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ 501505. **3. ఎ వసంతకుమారి C/o మారం బాలకృష్ణ,** నివాసం. 1-62, బడేపల్లి, జడ్చర్ల,మహబూబ్‌నగర్ 509301, తెలంగాణ, కాంటాక్ట్: 9704371547, ఇమెయిల్ ఐడి: sairamagencies.26084@gmail.com, **ఇక్కడ కూడా,** నివాసం. 1-3/1, విద్యానగర్ కాలనీ క్లబ్ రోడ్, పిఓ స్టేషన్ జడ్చర్ల, జిల్లా. మహబూబ్‌నగర్, తెలంగాణ 509301, కాంటాక్ట్: 9704371547, ఇమెయిల్ ఐడి: sairam@gmail.com | మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, బోడేపల్లి గ్రామం మరియు మున్సిపాలిటీ వద్ద అసెస్‌మెంట్ నం. 1193000004, 1193000005, 1193000006, బ్లాక్ నం. 1, విస్తీర్ణం 90 చ.గజాలు సైట్ యొక్క ఆర్‌సిసి రూఫ్డ్ బిల్డింగ్ ఇం.నం. 1-3/1, 1-3/2 మరియు 1-3/3 కలిగి ఉన్న అన్ని ఈజ్‌మెంట్ హక్కులతో ఉన్న యావత్తు. **సరిహద్దులుగా: తూర్పు:** 20'0" వైడ్ రోడ్డు, **పడమర:** 20'0" వైడ్ రోడ్డు, **ఉత్తరం:** 35'0" వైడ్ రోడ్డు, **దక్షిణం:** సాకలి సత్తయ్య ఇల్లు | **16.04.2026** **రూ. 95,84,604/-** (రూపాయలు తొంభై ఐదు లక్షల ఎనభై నాలుగు వేల ఆరు వందల నాలుగు మాత్రమే) |

ప్రత్యామ్నాయ నోటీసు సేవ కోసం ఈ చర్య తీసుకోబడింది. పైన పేర్కొన్న రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు, హామీదారులు ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోపు భవిష్యత్ వడ్డీతో పాటు బకాయిలను చెల్లించాలని కోరడం జరుగుతుంది, లేనిపక్షంలో (బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర హక్కు పరిష్కారానికి భంగం కలిగించకుండా) సెక్యూర్డ్ ఆస్తులు / తనఖా ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని నిబంధనలలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పైన పేర్కొన్న పార్టీలు పైన పేర్కొన్న ఆస్తులను ఎలినేట్ చేయవద్దని, వాటిలో మూడవ పక్ష ఆసక్తిని సృష్టించవద్దని కూడా సూచించబడింది. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ దీనిపై ఛార్జ్ కలిగి ఉంది.

తేదీ: 07.05.2026, ప్రదేశం: తెలంగాణ సం/- **అధీకృత అధికారి, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**



## నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

**(గతంలో నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్)**

**రిజిస్టర్డ్ కార్యాలయం: యూనిట్ నెం. 305, 3వ అంతస్తు, వింగ్ 2/ఇ, కార్పొరేట్ అవెన్యూ, అంధేరీ-ఘట్కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (తూర్పు), ముంబయి-400093**

NIWAS HOUSING FINANCE

**స్వాధీనతా ప్రకటన (రూల్ 8 (1) మరియు (2))**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (యాక్ట్), 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని (రూల్ 3)తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ తెలిపిన సెక్యూర్డ్ క్రెడిటార్ అధీకృత అధికారి జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారం నోటీసులో తెలిపిన మొత్తమును సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని దిగువ తెలిపిన రుణగ్రహీత(లు)లను కోరడమైనది.
కాని రుణగ్రహీత(లు) బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8తో చదవబడు చట్టములోని సెక్షన్ 13లోని ఉప సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ NHFL యొక్క అధీకృత అధికారి అయిన క్రింది సంతకముదారు క్రింద తెలిపిన ఆస్తిని ఒక్కొక్క ఆస్తి ఏదురుగా తెలిపిన తేదిన స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.
సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8)లోని సదుపాయములను వినియోగించుకొనుచూ మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల లభ్యతను పొందగలరని రుణగ్రహీతలను కోరడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపకూడదనీయు ఒక వేళ జరిపినట్లయితే దిగువ తెలిపిన మొత్తానికి మరియు దానిపై ఇతర చార్జీలకు సంబంధించి NHFL వారి చార్జ్‌కు లోబడి ఉండును.

| రుణ ఖాతా నంబరు | రుణగ్రహీత(లు) & ఆస్తి వివరములు | మొత్తం & డిమాండ్ నోటీసు తేది | స్వాధీనత తేది | స్వాధీనత స్థితి |
|---|---|---|---|---|
| LNBOD0HL-03240041531 | 1. సాయికుమార్ కాస్తుల (రుణగ్రహీత) 2. కాస్తుల అంజమ్మ (సహ-రుణగ్రహీత) | రూ. 12,59,213/- (రూపాయలు పన్నెండు లక్షల యాభై తొమ్మిది వేల రెండు వందల పదమూడు మాత్రమే) తేది: 13-ఫిబ్రవరి-2026 | 05-మే-2026 | లాంఛనప్రాయ స్వాధీనత |

**ఆస్తి వివరణ:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర మం॥, బోగారం గ్రా॥ మరియు గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామకంఠంలోని ఖాళీ స్థలంలో ఉన్న 60 చ॥గ॥లు లేదా 50.16 చ॥మీ॥ల విస్తీర్ణము కలిగిన కూల్చివేసిన నివాస ఇంటి నెం. 4-27 యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: 15' వెడల్పు రోడ్డు, దక్షిణం: కె. రమేష్ ఇల్లు, తూర్పు: కె. రమేష్ ఖాళీ స్థలం, పడమర: కె. స్వామి ఇల్లు.

తేది: 07-05-2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశము: తెలంగాణ నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్



## కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK)

ఇంటి నెం. 58, ఎంఐజి 1వ అంతస్తు, ఫేజ్-2, సైట్ 1, పోతిరెడ్డిపల్లి బైపాస్ రోడ్డు, సంగారెడ్డి-502295. ఫోన్ నెంలు. 08455-277550.
ఇ-మెయిల్: Sangareedy@canfinhomes.com, CIN: L85110KA1987PLC008699, వెబ్‌సైట్: www.canfinhomes.com

**డిమాండ్ నోటీసు**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (రూల్స్)లోని రూల్ 3(1)తో చదవబడుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI యాక్ట్)లోని సెక్షన్ 13(2) క్రింద

SARFAESI చట్టము క్రింద **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకముదారు రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలుపబడిన మొత్తాలను తిరిగి చెల్లించమని దిగువ జాబితాలో గల రుణగ్రహీతలు/హామీదారులు (ఇకమీదట "సదరు రుణగ్రహీతలు"గా రెఫర్ చేయబడుదురు)లను కోరుతూ డిమాండ్ నోటీసు జారీచేసినారు. వివరాలు దిగువ ఇవ్వబడినవి.
సదరు నోటీసులో రుణగ్రహీతలచే అక్నాలెజ్డ్ చేయబడకుండా/పోస్టల్ అథారిటీలచే బట్వాడా కాకుండా తిరిగి వచ్చినవి. అందువలన కంపెనీ సమృద్ధిగా ఈ డిమాండ్ నోటీసు (రూల్ 3(1)లోని నిబంధనల ప్రకారం) ప్రచురణ ప్రభావితమైనది. దిగువ సంతకముదారు ఈ నోటీసులను సదరు చట్టము ప్రకారము సదరు రుణగ్రహీతల యొక్క మాకు తెలిసిన వారి ఆఖరి చిరునామాల యొక్క ఆవరణములవద్ద అతికించినారు. రుణము యొక్క బకాయి తిరిగి చెల్లింపు కొరకు సెక్యూరిటీగా దిగువ ఆస్తులను దిగువ తెలిపిన విధంగా సంబంధిత పార్టీలచే కంపెనీకి తనఖా పెట్టబడినవి.

| క్ర. సం. | రుణగ్రహీతలు/హామీదారులు పేరు & చిరునామా | డిమాండ్ నోటీసు ప్రకారం క్లెయిమ్ చేసిన మొత్తం | సెక్యూర్డ్ ఆస్తుల వివరణ | ఎన్‌పిఎ తేది |
|---|---|---|---|---|
| 1 | **1. శ్రీ దేవురపల్లి సౌజన్య తండ్రి దేవురాంపల్లి వెంకయ్య (రుణగ్రహీత)** చిరునామా: 4-68, మునిదేవునిపల్లె గ్రామం, కొండాపూర్ మండలం, సంగారెడ్డి, తెలంగాణ, 502295 **హామీదారు: మణికాయల రాజు** తండ్రి కమ్మరి మచెందర్, 1-38/బి, వెలిమల గ్రామం, రామచంద్రపురం మండలం, మెదక్, తెలంగాణ-502300. | **రూ. 14,41,432/- (రూపాయలు పధ్నాలుగు లక్షల నలభై ఒక్క వేల నాలుగు వందల ముప్పై రెండు మాత్రమే)** | తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మం॥, మునిదేవునిపల్లి గ్రా॥, గ్రామపంచాయతీ వద్ద 60.00 చ॥గ॥ల విస్తీర్ణములో 540 చ॥అ॥ల ఆర్‌సిసి బిల్టప్ ఏరియాతో నివాస గృహము ఇంటి నెం. 5-58 యావదాస్తి. సరిమద్దులు: ఉత్తరం: డి. అనంతయ్య స్థలం & ఇల్లు, దక్షిణం: ఎన్. కిష్టయ్య స్థలం, తూర్పు: జి.పి. రోడ్డు, పడమర: జి.పి. రోడ్డు. | **01-05-2026** |
| 2 | **1. శ్రీ పల్నాటి రాకేష్ తండ్రి పల్నాటి మహేష్ (రుణగ్రహీత) 2. శ్రీమతి పల్నాటి గీత భర్త పల్నాటి మహేష్ (సహ-రుణగ్రహీత)** చిరునామా: 1-35, అన్నారం గ్రామం, గుమ్మిదల మండలం, మెదక్, తెలంగాణ, 502313. | **రూ. 29,17,685/- (రూపాయలు ఇరవై తొమ్మిది లక్షల పదిహేడు వేల ఆరు వందల ఎనభై ఐదు మాత్రమే)** | తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదాల మం॥, అన్నారం గ్రా॥, గ్రామపంచాయతీ వద్ద సర్వే నెం. 227లో 91.38 చ॥గ॥ల విస్తీర్ణములో 275 చ॥అ॥ల ఆర్‌సిసి బిల్టప్ ఏరియాతో నివాస గృహము ఇంటి నెం. 3-100/3 యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: వెంకట్ రామ్ రెడ్డి ఇల్లు, దక్షిణం: 15 - వెడల్పు రోడ్డు, తూర్పు: 13-వెడల్పు రోడ్డు, పడమర: కె. నర్సింహా ఖాళీ స్థలం. | **01-05-2026** |
| 3 | **1. శ్రీ తలారి నరేష్ తండ్రి తలారి నర్సింలు (రుణగ్రహీత) 2. శ్రీమతి తలారి లక్ష్మి భర్త తలారి నర్సింలు (సహ-రుణగ్రహీత)** చిరునామా: 3-59, శివానగర్ గ్రామం, జిన్నారం మండలం, సంగారెడ్డి, తెలంగాణ, 502319 | **రూ. 17,67,802/- (రూపాయలు పదిహేడు లక్షల అరవై ఏడు వేల ఎనిమిది వందల రెండు మాత్రమే)** | తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, జిన్నారం మం॥, శివానగర్ గ్రా॥, గ్రామపంచాయతీ వద్ద 91.00 చ॥గ॥ల విస్తీర్ణములో 150 చ॥అ॥ల ఆర్‌సిసి బిల్టప్ ఏరియాతో నివాస గృహము ఇంటి నెం. 4-13/3 యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: జి.పి రోడ్డు, దక్షిణం: జి.పి రోడ్డు, తూర్పు: కామిని రాజు ఇల్లు, పడమర: ఆర్ & బి రోడ్డు. | **01-05-2026** |
| 4 | **1. శ్రీ శ్యామ్లెట్ రాజు తండ్రి కె. స్వామి (రుణగ్రహీత) 2. శ్రీమతి కె. నర్సమ్మ భర్త కె. స్వామి (సహ-రుణగ్రహీత)** ఇంటి నెం. 1-22/1, పోచమ్మ దేవాలయం దగ్గర, హరిజన్ బస్తీ, హైటెక్ సిటీ, మాదాపూర్, కె వి రంగారెడ్డి, తెలంగాణ - 502319 | **రూ. 35,76,929/- (రూపాయలు ముప్పై ఐదు లక్షల డెబ్బై ఆరు వేల తొమ్మిది వందల ఇరవై తొమ్మిది మాత్రమే)** | తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మం॥, మాధాపూర్ పాత గ్రా॥ వద్ద 100.00 చ॥గ॥లు లేదా 83.60 చ॥మీ॥ల విస్తీర్ణముతో నివాస గృహము ఇంటి నెం. 1-22/1 యావదాస్తి. సరిహద్దులు: ఉత్తరం: ఈశ్వరయ్య ఇల్లు, దక్షిణం: 15 అడుగుల వెడల్పు రోడ్డు, తూర్పు: ఇ సత్తయ్య మరియు ఇతరుల యొక్క ఇంటి నెం. 1-22 (భాగము), పడమర: ఈరయ్య ఇల్లు. | **01-05-2026** |

***చెల్లింపు తేది వరకు పైన తెలిపిన తేదీ నుండి అంగీకరించిన విధంగా అంగీకరించిన రేట్ల వంతున తదుపరి వడ్డీతో చెల్లించవలసియున్నది.**
ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా అంగీకరించిన రేటు వంతున వడ్డీతో పైన తెలిపిన మొత్తమును చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరడమైనది. విఫలమైనచో పైన తెలిపిన సెక్యూరిటీని అమలు చేయుటకు SARFAESI చట్టము క్రింద చర్యలను ప్రారంభించుటకు దిగువ సంతకముదారు ముందుకు సాగెదరు. తదుపరిగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు వారికి లభించే సమాయానికి సంబంధించి చట్టములోని సెక్షన్ 13(8) యొక్క నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను/హామీదారులను కోరడమైనది.

**తేది: 06-05-2026, ప్రదేశం: సంగారెడ్డి** **సం/- అధీకృత అధికారి, కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**

## మోడీ సభ విజయవంతం చేద్దాం: నాగేశ్వర్ రెడ్డి పిలుపు



సికింద్రాబాద్, మే 6 (సాక్ష్యం): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు కాందాడి నాగేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం సికింద్రాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, దేశ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోడీ హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించనున్నారని చెప్పారు. ఈ సభను భారీగా విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు నాగేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**– ప్రధాని మోడీ పర్యటన షెడ్యూల్**

మే 10 మధ్యాహ్నం 1:10 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరు మధ్యాహ్నం 2:20 గంటలకు బేగంపేట్ ఎయిర్ పోర్ట్ కు చేరుకుంటారు. 2:30 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వద్ద వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలుఅనంతరం హెలికాప్టర్‌లో ఎంబుజ జబ్ఎ కి ప్రయాణంసాయంత్రం 3:45 నుంచి 4:15 వరకు సాయి సింధు హాస్పిటల్ ప్రారంభోత్సవం4:40 గంటలకు తిరిగి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ చేరిక 5:30 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు చేరిక సాయంత్రం 6:30 వరకు బహిరంగ సభలో పాల్గొనడం 6:45 గంటలకు జామ్‌నగర్‌కు బయలుదేరుతారాని పేర్కొన్నారు.ఈ మేరకు ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ విడుదలైందని నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.

## ప్రారంభమైన " శ్రీ వైష్ణవి రైస్ ఇండస్ట్రీస్ "



ఖానాపురం, మే 6 (సాక్ష్యం న్యూస్) : ఖానాపురం మండల కేంద్రానికి చెందిన తోటకూరి లావణ్య-కిషన్ దంపతులచే పెద్దమ్మగడ్డ తండా వద్ద నిర్మితమైన " శ్రీ వైష్ణవి రైస్ ఇండస్ట్రీస్ " బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది.పర్వతపు శివప్రసాద్ శాస్త్రి వేదమంత్రోచ్ఛరణలు , ప్రత్యేక పూజల నడుమ జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు గోనెల రవీందర్, ఎస్ బి ఐ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ ,ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సాధరణ రైతు కుటుంబానికి చెందిన తొటకూరి కిషన్ రైతు కు అందుబాటులో రైస్ మిల్ ను నిర్మించి సేవలు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రైతు పండించిన ధాన్యానికి మంచి ధర కల్పించి, ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించాలని వ్యాపారంలో అర్థికాభివృద్ధి సాధించాలని అకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, నర్సంపేట డివిజన్ రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం నరేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సింగిరికొండ మాధవ శంకర్, కోశాధికారి రవి, మల్యాల పోశేట్టి , గొల్లపూడి క్రిష్ణ , ఊటుకూరి సాంబయ్య , ఆత్మ డివిజన్ ఛైర్మన్ యడ్ల భిక్షంరెడ్డి , రాగంపేట సర్పంచ్ ఎలగందుల రాజు , కొత్తూరు సర్పంచ్ జాటోత్ వినోద్ కుమార్ , సోసైటి సీఈఓ అంజనేయులు , వివిధ రైస్ మిల్ యజమానులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, మిత్రులు పాల్గొన్నారు.

## హెచ్ఎంటి నగర్‌లో రూ.1.10 కోట్ల సిమెంట్ రోడ్లు



ఉప్పల్, మే 6 (సాక్ష్యం) నాచారం హెచ్ఎంటి నగర్ కాలనీలో నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కాలనీ వెల్ఫేర్ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం హెచ్ఎంటి నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి మేరకు రూ.1 కోటి 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే హెచ్ఎంటి నగర్ కమాన్ నుంచి సిసిఎంబి క్వార్టర్స్ వరకు సీసీ రోడ్లు కూడా మంజూరు చేయించామని వెల్లడించారు. ఇంకా ఎక్కడైనా రోడ్లు మిగిలి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటికి కూడా త్వరితగతిన నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రామ్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు యాదగిరి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాల్ రెడ్డి, మక్బూల్, కట్ట బుచ్చన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతంపై మాజీ డిప్యూటీ మేయర్ నివాసంలో చర్చలు



సికింద్రాబాద్, మే 6 (సాక్ష్యం): సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాయి బాబా జన్మదినోత్సవం సందర్భంగా తార్నాకలో టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ సికింద్రాబాద్ అధ్యక్షుడు దీపక్ జాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ నాయకత్వంలో పార్టీ బలోపేతంపై చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర వ్యూహరచన అమలు, కార్యకర్తల చైతన్యం, ప్రజల్లో పార్టీ ప్రభావాన్ని పెంచే చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్టీని ప్రజల్లో మరింత బలంగా తీసుకెళ్లేందుకు స్థానిక సమస్యల పరిష్కారం, యువత మరియు కార్మిక వర్గాల భాగస్వామ్యాన్ని పెంపొందించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసి విశ్వాసాన్ని పెంపొందించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని సాయి బాబాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ప్రమాణ స్వీకారం

భూపాలపల్లి మే 6 సాక్ష్యం న్యూస్ భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కో-ఆప్షన్ ఎన్నికల్లో జనరల్ కేటగిరీ కో-ఆప్షన్ సభ్యుడిగా సజ్జనపు స్వామి, మహిళా కేటగిరీలో చల్లా రేణుక, మైనారిటీ జనరల్ కేటగిరీలో ఎం.డి అబ్దుల్ హఫీజ్, మైనారిటీ మహిళా కేటగిరీలో ఎం.డి మిన్హాజ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరైనారు అనంతరం నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు అంకితభావంతో, నిబద్ధతతో పని చేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.




## ఎన్ఎస్‌యూఐ కేంద్ర ఎన్నికల అథారిటీకి కిరణ్ ముగబసవ్ నియమితులయ్యారు






ALL INDIA CONGRESS COMMITTEE

Kanhaiya Kumar

24, Akbar Road
New Delhi-110 011

IMPORTANT NOTE

This is to notify that the Central Election Authority (CEA) is hereby constituted with the mandate to conduct internal organisational elections of the National Students' Union of India.

The CEA will comprise of the following members:

Shri Kiran Mugabasav
Shri K. K. Shastri
Shri Nishant Mandal

Kanhaiya Kumar

To -

Shri Mallikarjun Kharge
Hon'ble Congress President

Shri Rahul Gandhi
LoP of Lok Sabha

Shri K.C. Venugopal
Hon'ble General Secretary, AICC
(Incharge Organisation)



హైదరాబాద్ మే 6 (సాక్ష్యం): ఎన్ఎస్‌యూఐ అంతర్గత సంస్థాగత ఎన్నికలను పర్యవేక్షించేందుకు శ్రీ కన్హయ్య కుమార్, శ్రీ కిరణ్ ముగబసవ్‌ను ఆ పార్టీ కేంద్ర ఎన్నికల అథారిటీ (సీఈఏ)కి నియమించారు. హుబ్లీకి చెందిన సీనియర్ నాయకుడైన ముగబసవ్ గతంలో ఎన్ఎస్‌యూఐ ఎన్నికల కమిషనర్‌గా (2016--18) పనిచేశారు మరియు క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తగా గుర్తింపు పొందారు.

**కిరణ్ ముగబసవ్ కెరీర్‌లోని ముఖ్యాంశాలు:**

**సంస్థాగత నాయకత్వం:** ప్రస్తుతం ఏఐసీసీ సభ్యురాలిగా మరియు కేపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

**క్షేత్రస్థాయి ప్రభావం:** తెలంగాణలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ (ఆర్‌జీపీఆర్ఎస్)ను నిర్మించి, దాని జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

**అంకితభావం గల పాదయాత్రికుడు:** 3,570 కి.మీ. భారత్ జోడో యాత్ర, 600 కి.మీ. సర్వోదయ సంకల్ప పాదయాత్ర, మరియు 600 కి.మీ. లోక్ స్వరాజ్ పాదయాత్రలను పూర్తి చేశారు.

**వ్యూహాత్మక పాత్ర:** మహారాష్ట్ర మరియు న్యూఢిల్లీలో ఏఐసిసికి జాతీయ వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ఈ నియామకం, క్షేత్రస్థాయి సంఘటనలో ముగబసవ్‌కు ఉన్న విస్తృతమైన అనుభవాన్ని మరియు సత్య, అహింసా విలువలకు ఆయన జీవితకాల నిబద్ధతను సద్వినియోగం చేసుకుంటుంది.

## మార్కాపురం కలెక్టర్ కుర్చీ కిందే కబ్జా బాంబు..!

– 'స్పందన' కాదు 'సచ్చిపోయిన శవాల స్మశానం'..? – అధికారులు అంటే అక్రమార్కులకు ఏజెంట్లా..?



మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం మార్కాపురం జిల్లా పుట్టింది అభివృద్ధి కోసం కాదు,అధికారులు – కబ్జాదారులు కలిసి ' దోపిడీ డిపార్ట్‌మెంట్ ' పెట్టుకోవడానికి అని స్పష్టంగా తేలిపోయింది.యర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయతీకి దివంగత నేత ' వేగినాటి కోటయ్య ' రక్తం చిందించి సంపాదించిన 18 స్థలాలను,కలెక్టరేట్ నుండి గ్రామ సెక్రటరీ దాకా ఉన్న ప్రతి నీచుడు కలిసి కుక్కలకు విసిరినట్టు కబ్జాదారులకు విసిరేశారు.

**' వేగినాటి కోటయ్య 'ఆత్మ ఘోషిస్తోంది..!**

**"నన్ను చంపారు,నా కలలను చంపకండ్రా..?**

ఆ మహానుభావుడి సమాధి మీద నిలబడి ఉచ్చ పోస్తున్నారు ఈ అధికారులు.ఆయన అంతఃకరణ శుద్ధితో ఇచ్చిన స్థలాల్లో,ఈ దొంగలు రేకుల షెడ్లు వేసి అద్దెలు వసూలు చేస్తున్నారు.మీరు తినేది అన్నం కాదు... ఆయన ఉసురు.మీ కడుపులో పురుగులు పడి చస్తారు అంటూ ఆయన అభిమానులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

**' కంచర్ల నాగేశ్వరరావు గౌడ్ ' 5 ఏళ్ల రక్తం, చెమట వృథానా..?**

' పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా ' రాష్ట్ర మీడియా ఇంచార్జ్ అయిన ఆయన,గ్రామ సెక్రటరీ ఆఫీస్ నుండి కలెక్టర్ ఛాంబర్ దాకా చెప్పులు అరిగేలా తిరిగాడు.' మీకోసం ' లో అర్జీ ఇస్తే తహశీల్దార్ దాన్ని తన ఇంట్లో సమోసాలు పెట్టుకోడానికి వాడుకున్నాడు. మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న' మీకోసం ' కార్యక్రమం లో అర్జీ ఇస్తే ఇంచార్జ్ కలెక్టర్ ' రాజాబాబు 'దాన్ని టాయిలెట్ పేపర్‌గా వాడుకున్నాడు.థూ..మీ బతుకులు కుళ్ళిపోను.

**యర్రగొండపాలెం తహశీల్దార్ :-**

మీరు తహశీల్దార్‌వా..? కబ్జా దళారివా..? 'మీకోసం' కార్యక్రమాన్ని 'మా జేబుల కోసం' గా మార్చేశావ్.నీ ఆఫీసులో రేట్ లిస్ట్ పెట్టుకున్నావా..? సంతకానికి ఇంత,రికార్డు మార్చడానికి ఇంత అని..

**4.ఇరిగేషన్,మైనింగ్ :-**

ఈ శాఖలలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా లేరు..?ప్రభుత్వ సొమ్ము తినే పందికొక్కులు వలె ఉంది వారి పనితీరు.చెరువులు అమ్మేశారు,వాగులు పూడ్చేశారు, మండల ప్రజా పరిషత్తు కార్యాలయం స్థలంలో వ్యాపారాలు చేయిస్తున్నారు.మీ అమ్మ మొగుడి సొమ్మా అది..? మీకు పుట్టే పిల్లలు కూడా అంగవైకల్యంతో పుడతారు..ఇది ప్రజల శాపం.

**గతంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శికీ :-**

మీ మొహం చూస్తేనే కబ్జా కంపు కొడుతోంది. నీ ఆఫీస్ ముందే పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తుంటే నువ్వు కళ్ళు మూసుకుని కూర్చున్నావ్.నీ నోట్లో లంచం సొమ్ము కుక్కారా..? నిన్ను ఉరి తీయాలి అంటూ గ్రామ ప్రజలు,అతన్ని బాధితులు ఆగ్రహంతో పలికుతున్నారు..

**గిద్దలూరు తహశీల్దార్ ఆఫీస్‌నే మింగేశారు..**

ప్రభుత్వ ఆఫీసునే దొంగ ' ఆన్‌లైన్ ' రికార్డులతో కాజేసిన చరిత్ర మీది.రేపు కలెక్టరేట్‌ను " మా తాత బ్రిటీష్ వాడి దగ్గర గిఫ్ట్ తీసుకున్నాడు " అని బాండ్ పేపర్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేసినా మీరు గుడ్డిగా సంతకం పెడతారు.ఎందుకంటే మీరు మనుషులు కాదు..లంచాలకు అమ్ముడుపోయిన పశువులు.

మిల్లంపల్లి సర్వే నెం.146/2,513, 518 లో జరిగిన దోపిడీకి ఎవడు సమాధానం చెప్తాడు..?అసైన్డ్ భూముల్లో కార్పొరేట్ స్కూళ్లు,చెరువు శిఖంలో వెంచర్లు, పంచాయతీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు... ఇది మార్కాపురం జిల్లానా..?మాఫియా రాజ్యమా..?

**పీఏయఫ్ తరుపున ప్రజల డిమాండ్లు – ప్రభుత్వానికి అల్టిమేటం**

**1.తక్షణ సస్పెన్షన్లు :-**

యర్రగొండపాలెం,మిల్లంపల్లి కబ్జాలకు సహకరించిన ఇంచార్జ్ కలెక్టర్,జేసీ,తహశీల్దార్,ఎంపీడీవో,ఇరిగేషన్, మైనింగ్,రెవెన్యూ అధికారులను 24 గంటల్లో సస్పెండ్ చేసి,అవినీతి నిరోధక శాఖకు విచారణకు ఆదేశించాలి.

**2.కబ్జాలు ఖాళీ :-**

48 గంటల్లో 18 పంచాయతీ స్థలాలు, ఎంపీడీవో ఆఫీస్ స్థలం,అసైన్డ్ భూములు, చెరువు,రాళ్ళవాగు భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ బోర్డులు పెట్టాలి.

**3.క్రిమినల్ కేసులు :-**

కబ్జాదారులు,వారికి సహకరించిన అధికారుల పై క్రిమినల్ కేసులు నమోదు చేసి,జైలుకు పంపాలి.

**4.గిద్దలూరు తహశీల్దార్ ఆఫీస్ కుంభకోణం :-**

ప్రభుత్వ ఆఫీసునే కాజేసిన ఘటన పై సి.బి.ఐ కు సిఫారసు చేసి విచారణకు సిఫారసు చేయాలి.

**5.బహిరంగ క్షమాపణ :-**

'కంచర్ల నాగేశ్వరరావు గౌడ్' కు,యర్రగొండపాలెం ప్రజలకు జిల్లా కలెక్టరేట్ అధికారులు బహిరంగ క్షమాపణ చెప్పాలి.

**" ఇది ఆఖరి అవకాశం " -- ప్రజల హెచ్చరిక :-**

" ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది అవినీతిని అంతం చేస్తామని.కానీ మార్కాపురం జిల్లాలో అధికారులు మాత్రం పాత ప్రభుత్వ బాటలోనే దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఈ కబ్జా కంపును కడగకపోతే,ప్రజలే రోడ్డెక్కి తేల్చుకుంటారు. అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి " అని ' పీపుల్స్ యాక్షన్ ఫోరం ఇండియా ' తేల్చి చెప్పింది. అలాగే " వేగినాటి కోటయ్య ఆత్మకు శాంతి చేకూరాలి,ఆయన కలలు కన్న గ్రామం అభివృద్ధి చెందాలి "అనేదే యర్రగొండపాలెం ప్రజల కోరిక.

## సొసైటీలు రాజకీయ కేంద్రాలు కావు: యశ్వంత్ రెడ్డి

– నామినేటెడ్ విధానంపై ఘాటు విమర్శలు – రైతుల ప్రయోజనాలకే సొసైటీలు పనిచేయాలి









మెదక్ జిల్లా,టేక్మాల్, మే 6, (సాక్ష్యం న్యూస్ ):- సొసైటీలు రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, నామినేటెడ్‌ఎ పదవులకు స్థానం లేదని పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి స్పష్టం చేశారు. 597 జీవోపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని నిర్ణయించడంతో జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు ఆయన మళ్లీ బుధవారం నాడు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయనకు శాలువాలు, పూలమాలలతో ఘన సన్మానం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సొసైటీలు కేవలం రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని, నామినేటెడ్ విధానంతో పదవులు కట్టబెడితే అవి నిర్వీర్యమవుతాయని హెచ్చరించారు. అవసరమైతే ఎన్నికలు నిర్వహించాల్సిందే తప్ప నామినేషన్ సరైంది కాదన్నారు. రైతుల నుంచి వ్యతిరేకత పెరుగుతున్నందునే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు భయపడి నామినేటెడ్ ప్రస్తావనను తెరపైకి తీసుకువచ్చిందని విమర్శించారు. రైతుల సభ్యత్వంతో కొనసాగుతున్న సొసైటీల్లో నామినేటెడ్ పదవులకు అవకాశం లేదన్నారు.అధికారుల పాలనలో రైతులు రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వరి కోతల సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.పాలకవర్గం సహకారంతో సొసైటీని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని, గతంలో నిలిచిపోయిన సొసైటీ పెట్రోల్ పంపును మళ్లీ ప్రారంభించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. సొసైటీల న్యాయం కోసం పోరాడిన అడ్వకేట్ బుచ్చిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీశైలం, శ్రీరాములు, చందర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, మాజీ జడ్పీటీసీ ముక్తార్, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, ఎలకుర్తి మాజీ ఎంపీటీసీ లకావత్ మోహన్,మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, సాయిలు, శ్రీనివాస్, నాయకులు అడివప్ప, సలీం, భాస్కర్, రమేష్ నాయక్, రవి, సీఈవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళుతున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు ముఖ్య పరిపాలన అధికారి మంత్రి ప్రగడ క్రాంతి కుమార్‌కు న్యాయశాఖ ఉద్యోఘన సన్మానం



**(మహబూబాబాద్ జిల్లా టౌన్ రిపోర్టర్ సాక్ష్యం మే 06)** 05.09.2022 మహబూబాబాద్ జిల్లా ఖమ్మం నుండి పదోన్నతి పై చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా జిల్లా కోర్టు నందు మూడున్నర సంవత్సరాల పాటు విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులతో మరియు ఉద్యోగులతో న్యాయవాదులతో పోలీసు అధికారులతో మరియు ఇతర అధికార వర్గాలతో తమ విధి నిర్వహణలో ఎవరికి ఎటువంటి ఆటంకాలు ఇబ్బందులు లేకుండా చిన్న చిన్న విషయాలలో ఏదైనా వచ్చిన దానికి వారు సమర్థిస్తూ అందరితో మమేకమై తన విధులు నిర్వహిస్తూ బదిలీపై సూర్యాపేట జిల్లా కోర్టుకు వెళ్ళినారు ఈ కార్యక్రమంలో జిల్లా పన్యాయమూర్తిమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శాలిని, జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి, అదనపు జూనియర్ జడ్జి కృష్ణ తేజ్ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనిత, ఉపాధ్యక్షులు స్వరూప రాణి,అసోసియేట్ ప్రెసిడెంట్ అహ్మద్ ఖాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పూస శ్రీనివాస్, కోశాధికారి వీరు నాయక్ డిస్టిక్ లీగల్ సర్వీస్ సూపర్డెంట్ శ్రీధర్ సీనియర్ సూపర్ తదితరులు పాల్గొన్నారు కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ వారి సేవల గురించి అభినందించారు వారి విధి నిర్వహణలో నేను జిల్లా జడ్జిగా రావడం అదృష్టకరమని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని పనులు సక్రమంగా జరగడానికి కారణం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అని కొనియాడారు సీనియర్ సివిల్ జడ్జి శాలిని ఒక మంచి పరిపాలన అధికారి ఆ శాఖను నిర్వహించినప్పుడు అధికారులకు గాని ఉద్యోగులకు గాని ఎటువంటి ఆటంకాలు రాకుండా వారు సేవలందించినందుకు వారు అభినందించారు స్వాతి మురారి వారి సేవలు మరువలేనివని వ్యవస్థను గాడిలో పెట్టి నడపడం సాధ్యమైన విషయం కాదు ప్రతి విషయంలోనూ పరిపాలన అధికారి పాత్ర ఎంతో ముఖ్యమని కొనియాడారు అదనపు జూనియర్ జడ్జి కృష్ణ తేజ్ మాట్లాడుతూ వారి సేవలో వారి పదవి విరమణ వరకు మా న్యాయమూర్తులు అందరికీ అందాలని వారి సేవలను అభినందించినారు లీగల్ సర్వీస్ సూపర్డెంట్ అదాలత్ శ్రీధర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుండి వారి యొక్క అనుభవనాల్ని క్రాంతి కుమార్ స్టెనోగ్రాఫర్ నుండి పరిపాలన అధికారిగా ఖమ్మం జిల్లాలో వారితో కలిసి పనిచేసిన చేసిన అనుభవం జ్ఞాపకాలు వారి ఉద్యోగరీత్యా పనిని దైవంగా భావించి పనిచేస్తారని చెప్పినారు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అహ్మద్, మాట్లాడుతూ సమన్యాయానికి మరో రూపం ఎవరి పట్ల వివక్ష లేకుండా పనిచేసినటువంటి ఘనత విధి నిర్వహణను దైవాధారంతో సమానమని పనిచేసే వ్యక్తి ఎవరు ఆపదలో ఉన్న ఆదుకునే మంచి అధికారి బదిలీపై వెళుతున్న పరిపాలన అధికారికి శాలువాతో సన్మానించడం జరిగినది చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పదోన్నతి పై మహబూబాబాద్ జిల్లాకు రావడం నా అదృష్టమని ఉద్యోగస్తులందరూ సహకరించి పనిచేసినందుకు ధన్యవాదాలు తెలిపినారు సక్రమంగా పని చేసినప్పుడే వ్యవస్థలు సవ్యంగా నడుస్తాయని ఆటంకాలు లేకుండా ప్రతి ఒక్క ఉద్యోగి తన పనిని దైవారాధనగా భావించి పనిని భారం అనుకోకుండా పనిచేయడమే ఉత్తమ లక్షణము అని సూచించారు అధికారులతో ఉద్యోగులతో కలిసి పనిచేసిన ఉద్యోగులను అభినందించారు.

## గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో
# పాల్గొన్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ 6 మే (సాక్ష్యం)** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదలపై వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ నగరాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే సాధ్యమైందని, ఇందుకు అవసరమైన నిధులు కూడా మంజూరయ్యాయని స్పష్టం చేశారు. నగరాభివృద్ధిలో భాగంగా ఎయిర్‌పోర్ట్, కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్టైల్ పార్క్ వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. శానిటేషన్, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పిస్తున్నారని చెప్పారు. మంచి పరిపాలన, మంచిమాట ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని , అధికారం శాశ్వతం కాదు, కానీ మంచి పేరు మాత్రం ఎప్పటికీ నిలిచిపోతుంది అని ఎంపీ డా. కడియం కావ్య వ్యాఖ్యానించారు. వరంగల్ నగరానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని పేర్కొంటూ, ప్రసిద్ధ వేయి స్తంభాల ఆలయ అభివృద్ధికి రూ. 14 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన మరిన్ని నిధులు, ప్రాజెక్టుల కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కుల నిధులను సాధించడంలో కేంద్రాన్ని పదేపదే కోరుతున్నామని, గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషితో అమలు దిశగా తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్లు ప్రజల సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజాసేవ చేయడానికి అధికారమే ఒక్కటే మార్గం కాదని, ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉంటూ సేవ చేయాలని, ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలని కార్పొరేటర్లకు సూచించారు. రానున్న రోజుల్లో అందరికీ మంచి రాజకీయ భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ కమిషనర్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, కార్పొరేటర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా కాళ్లే లత నర్సింహులు



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్.** మహిళ కాంగ్రెస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షురాలుగా యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన కాళ్ళే లత నర్సింలు ను నియమిస్తూ ఆమెకు బుధవారం నియామక పత్రాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , మహిళా కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ ల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కాళ్ళే లతా నర్సింలు ను యాదగిరిగుట్ట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ వైపుకు వచ్చేందుకు ఆమె కృషి చేయాలని అన్నారు. మహిళలే పార్టీకి కీలకమని వారికి అన్ని రంగాలలో పార్టీ తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నామని అన్నారు. అనంతరం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ మాట్లాడుతూ పెద్ద కందుకూరు గ్రామాకి చెందిన కాళ్ళే లత నరసింహులు పార్టీ కోసం ఎంతగానో కష్టపడుతున్నారని అన్నారు వారి శ్రమను గుర్తించి మండల మళా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించాని అన్నారు. పార్టీ బలోపేతానికి వారు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా యాదగిరిగుట్ట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గా నియమితులైన కాళ్లే లతా నర్సింహులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భోనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బీర్ల శంకర్ యాదగిరిగుట్ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగ సత్యనారాయణ తదితరులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని యాదగిరిగుట్ట మండలంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహులు, మనోహర్ గౌడ్ , బలరాం, సీస నగేష్ , అరిగేసిద్ధులు , గుర్రం స్వామి, జోగు ఐలయ్య, లక్ష్మయ్య, కావలి సత్యనారాణ, మారయ్య, కసావు కృష్ణ, జహంగీర్ , మహిళా కాంగ్రెస్ నాయకులు జోగు అలివే , కాళ్ళే లలిత , శ్రీవల్లి, గుండ్లపల్లి సునీత, అరిగె సంతోష, రజిత, అరుణ, గుర్రం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మార్కెటింగ్ ధరలు, నిల్వ, రవాణా సమాచారం ఎప్పటికప్పుడు అందించాలి

– రైతు వారోత్సవాల్లో అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, 06 మే (సాక్ష్యం)** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఏనుమాముల మార్కెట్ యార్డులో రైతు వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం బుధవారం "రైతు వారోత్సవాలలో భాగంగా వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో రైతులు పండించిన పంటలు ముఖ్యంగా కాటన్ మేజ్, చిల్లి, ప్యాడి ఈ నాలుగు పంటలు తెలంగాణలో విరివిగా పడుతుందని, పంటలను మనము మార్కెటింగ్ ద్వారా ఎక్స్పోర్ట్ చేసే అవకాశాలు చాలా ఉన్నాయని ముఖ్యంగా కాటన్ చూసినట్లయితే కాటన్ కి విదేశాల్లో విపరీతమైన ధర పలుకుతుందని, ఈ పంటను నాణ్యతగా మనం ప్యాక్ చేసేందుకు అన్ని బ్యాగులు కాకుండా ప్రత్యేక ప్యాకింగ్ లో చేసినట్లయితే మరింతగా నాణ్యత పెరుగుతుందని ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు మార్కెటింగ్, నిల్వ, ధరల సమాచారం, రవాణా సదుపాయాలు వంటి అంశాలపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తమ పంటలకు సరైన ధరలు పొందేందుకు మార్కెట్ యార్డ్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ద్వారా రైతులు మరింత లాభాలు పొందవచ్చని తెలియజేశారు. మార్కెట్‌లో ఉన్న గిడ్డంగులు, తూకం సదుపాయాలు, బ్యాంకింగ్ సేవలు, ఎఫ్‌పీవోలు, రవాణా సదుపాయాలు వంటి అంశాలపై అధికారులు వివరించారు. రైతులు తమ పంటలను నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మార్కెటింగ్ శాఖ అదరపు సంచాలకులు ఆర్ లక్ష్మణుడు , అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, అదనపు సంచాలకులు మార్కెటింగ్ హైదరాబాదు ఆర్ లక్ష్మణుడు, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సురేఖ, లీడర్ బ్యాంక్ అధికారులు రాజు,ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం,గ్రేట్. 2 కార్యదర్శి ఎస్.రాము, అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాడూరి వేద ప్రకాష్, సంబంధిత అధికారులు వ్యాపారులు రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ కేంద్రం ప్రారంభించిన సీతక్క



**ఏటూరునాగారం, మే 06, (సాక్ష్యం) :** మండలంలోని చిన్నబోయినపల్లిలో 11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క.ఏజెన్సీ గ్రామాలలో నిరంతర విద్యుత్ సౌకర్యం ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి గ్రామంలో రూ. కోటి 46 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన 11 కె.వి. విద్యుత్ ఉపకేంద్రాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సౌకర్యం అందించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్నబోయినపల్లి 1.46 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఉప విద్యుత్ కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని ఈ ఉపకేంద్రం ద్వారా సుమారు చుట్టు పక్కల 14 గిరిజన గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఎలక్ట్రిసిటీ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ ఈ బిక్షపతి, డి ఈ నాగేశ్వరరావు స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

– ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ డిమాండ్



**డిండి. సాక్షం న్యూస్ :** మండల కేంద్రంలో ఎ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ్ ఉద్యమాన్నీ విజయవంతం గా బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత యువజన సమాఖ్య నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ హాజరై నారు. కార్యక్రమం లో భాగంగా మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా దేశ ప్రధానమంత్రికి లెటర్ల ద్వారా రైల్వే శాఖలో ఖాళీగా ఉన్నా 2.75 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తపాలా శాఖ లో ఖాళీగా ఉన్నప్పటికీ నియమాకాలు జరగడం లేదు ,అదే సమయంలో 2 శాతం ఉద్యోగాల కోత నిర్ణయం తీసుకోవడం యువతకు అన్యాయమని, అఖిల భారత యువజన సమాఖ్య పక్షాన నిరసన తెలియజేస్తున్నాం అన్నారు. ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదు,ఆర్ ఆర్ బి ఫలితాలు ఎందుకు పెండింగ్లో ఉన్నాయి,ఉద్యోగాల కోత ఎందుకు చేస్తున్నారు, రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి,ఆర్ ఆర్ బి ఫలితాలను తక్షణమే విడుదల చేయాలి,ఉద్యోగాల కోత నిర్ణయాన్ని రద్దు చేయాలి ,యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగం మా హక్కు మాపై అన్యాయం ఆపండనీ ప్రధానమంత్రి కి లెటర్ల ద్వారా నిరసన తెలియజేయడం జరిగింది. మా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రధానమంత్రిని కోరుతున్నాము అన్నారు. లేదంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎ ఐ వై యఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని అన్నారు. ఈ లెటర్లన్నీ దేశ ప్రధాన మంత్రికి చేరేలా పంపించాలని పోస్ట్ ఆఫీస్ అధికారికి ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఐ వై యఫ్ మండల కోశాధికారి నాయక్ మధుకర్, ఎండీ ఆదిల్, బుషిపాక గోవర్ధన్, కళ్లెం సిద్ధు, శశివరన్, రజినీకాంత్, కొండల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి, శివాలయ
# ధ్వజాస్తంభరోహణం, కట్ట మైసమ్మతల్లి ప్రతిష్ఠ







**హనుమకొండ, ఐనవోలు 6 మే (సాక్ష్యం)** ఐనవోలు మండలం గర్మిళ్ళపల్లి గ్రామంలో శ్రీ భూదేవి, నాభిశిల, శీతలాదేవి బొడ్రాయి మరియు శివాలయ ధ్వజాస్తంభరోహణం, శ్రీ కట్ట మైసమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం చివరి రోజు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు అతిథిగా హాజరైన కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి వేడుకున్నారు. ఈ ఉత్సవాల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గబ్బెట రోజా – అశోక్, ఉప సర్పంచ్ ఎల్లా గౌడ్, చెరుకు లక్ష్మీ కాంతమ్మ, చెన్న గౌరీ లక్ష్మీ, గంకిడి వెంకటేశ్వర్ రెడ్డి, బీరం దేవేందర్ రెడ్డి, పోరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గండి రమేష్, రాజరపు ఎల్లయ్య, సార్ల సురేష్, ఎల్. వెంకట్ రెడ్డి, మారెపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు గ్రామ బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ పై పెంచిన ధరలు తగ్గించాలి

– పేద మధ్య తరగతి ప్రజల పైన పెనుబారం మోపిన మోది

– సోతుకు ప్రవీణ్ కుమార్ సిపిఐ నగర కార్యదర్శి



**భూపాలపల్లి మే 6 సాక్ష్యం న్యూస్** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నగర కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయాయి సరికి పేద మధ్యతరగతి ప్రజల పైన పెద్ద ఎత్తున భారం మోపిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎన్నడు లేనివిధంగా కమర్షియల్ సిలిండర్ ధర 950 రూపాయలు పెంచడం సిగ్గుచేటు అని అన్నారు. కమర్షియల్ సిలిండర్ ధర 3500 చేరుకుందని ఈ భారం పేద ప్రజల పైన పడుతుందని తెలిపారు. పెట్రోల్ డీజిల్ ధరలను అదుపు చేయకుండా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపైన పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా పట్టణ కేంద్రంలో ఆందోళన పోరాటాలు జరుగుతున్నాయని అన్నారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరగడం వల్ల సామాన్య ప్రజలకు నిత్యావసరాలు ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని అన్నారు. ఒకప్పుడు టిఫిన్ 30 రూపాయలు ఉంటే గ్యాస్ ధరలు పెరిగాయని 50 రూపాయలు తీసుకుంటున్నారని, పెద్ద హోటల్లో అయితే జీఎస్టీ, పెరిగిన గ్యాస్ ధర పేరు మీద పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, బూడిద తిరుపత

# పిఎసిఎస్ చైర్మన్‌గా ఇమ్మడి రాంరెడ్డి



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..** యాదగిరిగుట్ట పిఎసిఎస్ చైర్మన్గా ఇమ్మడి రాంరెడ్డి బుధవారం యాదగిరిగుట్ట కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి వారి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం పిఎసిఎస్ పాలకవర్గానికి నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ప్రయత్నించగా తామంతా కోర్టుకు వెళ్లామని గౌరవ హైకోర్టు వారు తమకు అనుకూలంగా తీర్పునిచ్చారని అన్నారు. తిరిగి తమనే ఎన్నికలు జరిగే వరకు బాధ్యతలు చేపట్టాల్సిందిగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పిఎసిఎస్ లకు ఎన్నికలు జరపాలని అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ఎన్నికలు జరిపితేనే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. రైతులకు సకాలంలో యూరియా విత్తనాలు అందించేందుకు తగిన పంట పెట్టుబడి రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ సందర్భంగా తిరిగి పిఎసిఎస్ చైర్మన్ గా ఎన్నికైన ఇమ్మడి రామ్ రెడ్డికి కాచారం సర్పంచ్ కొండం ఉ



పేందర్ రెడ్డి, బాబు పేట సర్పంచ్ కొడే మహేందర్, పలువురు గ్రామాల సర్పంచులు రైతులు, నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాములు పరిశీలించిన
# వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద




**వరంగల్,06 మే (సాక్ష్యం)** వరంగల్ జిల్లా పరిధిలోని ఏనుమాముల ఈవీఎం గోదాంను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం) భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాంలో అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉన్నాయా లేదా అని కలెక్టర్ సమీక్షించారు. అలాగే, గోదాంలో విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి భద్రతా చర్యల అమలుపై సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత ముఖ్యమని, ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్య రాణి , వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎలక్షన్ డి టి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాదగిరి నరసన్న సేవలో రాజ్యసభ ఎంపీ వేం నరేంధర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్.** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయంలో రాజ్యసభ ఎంపీ శ్రీ వేం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయనకు లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నరేంధర్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం యాదగిరి నరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఆలయ ముఖ మండపంలో ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ ఆయనకు ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి తీర్థం, ఆలయ ఈవో భవాని శంకర్ స్వామి వారి చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ విశేషాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సుభిక్షం, శాంతి, అభివృద్ధి కోసం స్వామి వారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## యాగమూర్తులకు హారతిస్తున్న పూజారి



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం వేకువ జామున సుప్రభాతం చేపట్టిన పూజారు లు గర్భాలయంలోని మూలవర్లను మేల్కొల్పి నిత్యారాధనలకు శ్రీకారం చుట్టారు. బిందె తీర్థం బాలభోగం నివేదించారు. కవచమూర్తులకు సువర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. వేదమంత్ర పటనాలతో అష్టోత్తరం, స్వర్ణ పుష్పారాధన పర్వాలు కొనసాగించారు. అష్టభుజ మండపంలో శ్రీ సుదర్శన నరసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. గజవాహనంపై కళ్యాణమూర్తులను సాయంత్రం అలంకార జోడు సేవల ఊరేగింపు తతంగాలను నిర్వహించారు. దర్బార్ సేవోత్సవం చేపట్టారు. రాత్రి స్వయంభులకు ఆరాధన సహస్రనామార్చన జరిపారు.

### మిర్యాల పిఎసిఎస్ చైర్మన్‌గా
## కొత్త రఘుపతి భాధ్యతల స్వీకరణ

**కోదాడ మే 6, (సాక్ష్యం)** చిమిర్యాల పిఎసిఎస్ చైర్మన్ గా కొత్త రఘుపతి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. సర్పంచులు శాలువాతో చైర్మన్ ను సత్కరించారు.ఇట్టి కార్యక్రమంలో చిమిరియాల సర్పంచ్ కొత్త గురవయ్య ధోరకుంట సర్పంచ్ పాలకి సురేష్ నల్లబండగూడెం సర్పంచ్ అలసకాని భవాని శరబశ్వరరావు,మంగళ తండ సర్పంచ్ దారావత్ బాబ్జి ,సీఈవో జొన్నలగడ కృష్ణ మరియు డైరెక్టర్లు పాల్గొన్నారు.



### రైతులకు ఇబ్బంది లేకుండా ఆకాలవర్షానికి
## తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం
### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**(సాక్ష్యం) న్యూస్ భూపాలపల్లి, మే 6 :** రైతులకు ఇబ్బంది లేకుండా ఆకాలవర్షానికి తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం మహాదేవపూర్ మండలంలోని మహదేవ పూర్, సూరారం గ్రామాలలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం పరిస్థితిని స్వయంగా పరిశీలించి, రైతులతో ముకాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. రైతులు ఆందోళన చెందొద్దని, తడిసిన ధాన్యాన్ని తక్షణమే కాటారంలోని అన్నపూర్ణ పారబాయిల్ రైస్ మిల్ తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు రవాణా, దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం కాకుండా పర్యవేక్షణకు మిల్లుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేయాలని డీఎంకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బంది లేకుండా చూడాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, ఎంపిడిఓ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ఉద్దేశం: మంత్రి సీతక్క






**ఏటూరునాగారం, మే 06, (సాక్ష్యం) :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం లోని ఆశ్రమ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో లతో కొండాయి, దొడ్ల, మల్యాల, కొత్తూరు, గోవిందరాజుల కాలనీ గ్రామాల ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామం లోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో చిన్నబోయినపల్లి, శివాపూర్, షాపల్లి గ్రామాల ప్రజల నుంచి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారిగా ములుగు జిల్లా లో వినూత్నంగా గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వడివడిగా గ్రామాలలోని ప్రజల సమస్యలను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించుకుంటూ జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకునే ఫిర్యాదు దారుల కోసం ప్రత్యేకంగా దరఖాస్తు ఫారాన్ని రూపొందించడం జరిగిందని అందులో అర్జీదారులు తమ సమస్యలను తెలియజేయవచ్చని అన్నారు. కొండాయి గ్రామంలో అర్హులైన 115 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని స్పష్టం చేశారు. జంపన్న వాగు ప్రవాహం ఒడ్డున ఎట్టి పరిస్థితుల్లో ఇండ్లను నిర్మించుకోకుండా సురక్షిత ప్రాంతాలలో శాశ్వత ప్రతిపాదికన ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. నూతన గ్రామ పంచాయతీ పాలక వర్గం కొలువుదీరిన అనంతరం గ్రామాలలోని సమస్యలను పరిష్కరించడం కోసం నిధులు కేటాయిస్తున్నామని, గ్రామసభల ఆమోదం ద్వారానే ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి పనులకు నిధులను వెచ్చించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ఫిర్యాదుదారులు ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, నూతన పెన్షన్ల మంజూరు, అటవీ భూముల సమస్యలు గూర్చి అర్జీలు సమర్పిస్తున్నారని వాటన్నిటిని ప్రణాళిక బద్ధంగా సంబంధిత అధికారులతో సమగ్రంగా పరిశీలించి అర్హులైన జాబితా సిద్ధం చేస్తున్నామని, రెండవ విడతలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. జూన్ మాసంలో నూతన పెన్షన్లను అందించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తుందని స్పష్టం చేశారు. అటవీ భూముల పలు సమస్యలు తలెత్తుతున్న తరుణంలో త్వరలోనే అటవీశాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కరించే విధంగా విధి విధానాలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అడవులను కాపాడే బాధ్యత అందరి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డిఓ వెంకటేష్, కొండాయి సర్పంచ్ ఆలం మానస, చిన్నబోయినపల్లి, షా పల్లి సర్పంచులు జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు కొంటారా.. లేక తన్నులు తింటారా..









- వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో ప్రభుత్వానికి హెచ్చరించిన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పండించిన ప్రతి గింజను కొనేదాకా కాంగ్రెస్ని వదిలిపెట్టం
- రాష్ట్రంలోని రైతన్నల అవస్థలపై కష్టాలపై ఆవేదన
- కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ఇచ్చి సరిగ్గా నాలుగేళ్ల అయిన సందర్భంగా వరంగల్ లో సభ
- పలు తీర్మానాలను చేసిన రైతు సంగ్రామ సదస్సు

**హనుమకొండ 6 మే (సాక్ష్యం)** రైతులు పండించిన పంటలను కొంటారా లేదా 70 లక్షల తెలంగాణ రైతన్నల చేతిలో తన్నులు తింటారా అని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రైతన్నల పంటలను కొనకుంటే గ్రామ గ్రామాన తెలంగాణ రైతన్నలు నాగళ్లను మడత పెట్టి మరి సరిహద్దుల వరకు ఉ రికిస్తారని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ రైతన్నల చైతన్యాన్ని తక్కువ అంచనా వేయొద్దని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో రైతన్నల పంటలు అన్ని చివరి గింజ దాకా కొనేదాకా కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టేదే లేదని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ ఇచ్చి సరిగ్గా నాలుగు సంవత్సరాలైనా ఒక్క హామీని నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వరంగల్ లో ఏర్పాటు చేసిన రైతు సంగ్రామ సదస్సు సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేస్తున్న తీరుపైన విరుచుకుపడ్డారు. రైతన్నలు ఆందోళన చెందవద్దని, ఆత్మహత్యల గురించి ఆలోచించవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. అవసరమైతే కాలర్ పట్టుకొని కాంగ్రెస్ పార్టీని నిలదీద్దామని, గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులను తన్ని తరిముదాము కానీ ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కేవలం కొన్న పంటలకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందన్న ఏకైక ఉద్దేశంతోనే రాష్ట్రంలోని రైతన్నలను మోసం చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి సిగ్గు, శరం ఉంటే రైతన్నల కష్టాలను పట్టించుకోవాలని, లేకుంటే తెలంగాణ రైతన్నలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తన్ని తరిముతామని హెచ్చరించారు. గత 48 గంటల్లో దాదాపు ఎనిమిది మంది రైతన్నలు రాష్ట్రంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్ ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే దీనికి కారణమన్నారు. రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని చేతగాని దద్దమ్మ దగుల్బాజీ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నర సంవత్సరాల్లో రైతన్నలను నిండా ముంచుతున్న కాంగ్రెస్ పార్టీ నాలుగు సంవత్సరాల క్రితం రాహుల్ గాంధీని తెచ్చి రైతు డిక్లరేషన్ పేరిట అడ్డగోలుగా హామీలు ఇచ్చి రైతులతో ఓట్లు వేయించుకున్నదని మండిపడ్డారు. రాహుల్ గాంధీ రైతు హామీలు ఇచ్చి డిక్లరేషన్ పేరిట ఓట్లు దోచుకొని ఢిల్లీకి పారిపోయారని, తెలంగాణ రైతన్నలు ఆత్మహత్యల పాలవుతుంటే, అవస్థలకు గురవుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడ ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, పంటలకు బోనస్, పంటల కొనుగోళ్లు, యూరియా సరఫరా, కరెంటు కోతలు ఇలా రాష్ట్ర రైతాంగం పూర్తి సంక్షోభం దిశగా పోతున్నదని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని రైతన్నల కష్టాల పైన దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రైతన్నలు ఇంత అవస్థలు పడుతుంటే సిగ్గులేకుండా కాంగ్రెస్ పార్టీ రైతు వారోత్సవాలు, రైతు మేళాల పేరిట టైం పాస్ చేస్తున్నదన్నారు. ఎన్నికల ముందు 50 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి చివరికి 12 వేల కోట్ల రూపాయలు మాత్రమే చేసి రైతులను మోసం చేయడంతో అనేకమంది రైతన్నలు అప్పుల పాలయ్యారన్నారు. రైతులను రెచ్చగొట్టి బ్యాంకుల నుంచి రెండు లక్షల రుణాలు తెచ్చుకోవాలి, మాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని అన్నారు. రైతుల ఖాతాల్లో రైతు బంధు రావడం లేదు కానీ రాహుల్ గాంధీకి మాత్రం ప్రతి నెల టంచనుగా డబ్బులు పడుతున్నాయని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ లో ప్రెస్ క్లబ్ లో సమావేశం పెట్టి మరి రైతులకు రుణమాఫీ అంశంలో చర్చకు రావాలని రేవంత్ రెడ్డిని సవాలు చేస్తే పారిపోయిన పిరికిపంద అని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ పాలనలో అన్నదాతలకు అడ్రస్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రం, భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ మళ్ళీ ఈ కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యలు, పాముకాట్లు, వ్యవసాయ సంక్షోభం వంటి అన్ని సమస్యలు తిరిగి వస్తున్నాయి అన్నారు. వ్యవసాయ సంక్షేమ పథకాలు అన్నింటిని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరి మూడేళ్ల లోపే మూడు లక్షల డెబ్బై వేల కోట్ల రూపాయల అప్పు తెచ్చి ఎవరికి దోచి పెట్టిందని కేటీఆర్ ప్రశ్నించాడు. కనీసం ఎరువులు ఇవ్వడం చేతకాని ఎధవల సర్కార్ కాంగ్రెస్ పార్టీ అని పంటల కొనుగోలును పక్కకు పెట్టి కమిషన్లు, కాంట్రాక్టుల పైననే కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించిందన్నారు. రైతులు ఎండల్లో నిలబడి చక్కర వచ్చి పడిగాపులు పడి పడిపోతుంటే ఢిల్లీకి విమానాల్లో చక్కర్లు కొడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇంత వ్యవసాయ సంక్షోభ పరిస్థితులు ఉన్నా రైతు మరణాలు కొనసాగుతున్న ఇప్పటిదాకా ఒక్క సమీక్షా సమావేశాన్ని కూడా నిర్వహించిన పాపాన పోలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ బీజేపీ దేశంలో జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలనే కొనసాగిస్తుందన్నారు. బీజేపీ పార్టీ కూడా నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చి రైతుల నిరసనతో వెనక్కి తగ్గిందని స్వయంగా ప్రధాన మంత్రి క్షమాపణ కోరిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక నాలుగు పంట సీజన్లు వచ్చినయి కానీ పండించిన పంటను కొనుగోలు చేయమన్న ప్రతిసారి రైతులకు కష్టాలే ఎదురవుతున్నాయని, కొనుగోలు కేంద్రాలు పెట్టక, పెట్టిన కొనుగోలు కేంద్రాలలో పంటను కొనుగోలు చేయక తీవ్రంగా అవస్థల పాలు చేస్తున్నదని కేటీఆర్ అన్నారు.ఈ సందర్భంగా రైతన్నల పంటలను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, ఆత్మహత్యలకు సంతాపం ప్రకటించి రైతు మరణాల పాలైన రైతన్నలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్ ను సంపూర్ణంగా అమలు చేయాలని, రైతుల రుణమాఫీని సంపూర్ణంగా పూర్తి చేయడంతో పాటు రైతు భరోసా బకాయిలు చెల్లించాలని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్,బారాస నేతలు బోయినపల్లి వినోద్ కుమార్, సిరికొండ మధుసూదనా చారి, వరంగల్ పశ్చిమ తూర్పు మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, దాస్యం వినయ్భాస్కర్, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, కొండల లక్ష్మయ్య శ్రీనివాస్ రెడ్డి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బిఆర్ఎస్ నేతలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

## మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026
### - జేబి కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ



**హనుమకొండ 6 మే (సాక్ష్యం)** బాలసముద్రం ఎన్. టీ. ఆర్ ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో జే. బి. కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ వారి ఆధ్వర్యంలో 09-05-2026 న అంతర్జాతీయ మాతృ మూర్తి దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమ్మ గొప్పతనాన్ని కీర్తిస్తూ సకల కళల జాతర మరియు సినీ, టీ.వి కళాకారులచే నాటిక ప్రదర్శన వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు ఒ కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం.. ఈ కార్యక్రమంలో జే.బి కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు జడల శివ, కార్యదర్శి పి.ఆర్ ప్రసాద్,జనగాం రాము, పిట్టల మధుసూదన్, మగ్గిడి చందన, ఏ ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

### కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పులి సులోచనరావుకు అభినందనల వెల్లువ



**కోదాడ మే 6, (సాక్ష్యం)** సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పులి సులోచనరావు నియమించబడ్డారు. బుధవారం పులి సులోచనరావుకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే పద్మావతి ఆశీస్సులతో పులి సులోచనరావు రాబోయే రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు. పులి సులోచనరావు నియమకానికి సహకరించిన ఎమ్మెల్యే పద్మావతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్ పి శోభన పై పునర్విచారణ జరిపి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేత

చౌటుప్పల్ మే 6 (సాక్ష్యం ) ఆర్.పి కే. శోభన పై వచ్చిన ఆరోపణలు నిరాధారమని ఆమె విధుల నుండి తొలగింపు ఉత్తర్వులపై తిరిగి పునర్విచారణ జరిపి విధుల్లోకి తీసుకోవాలని చౌటుప్పల్ మహిళ సంఘాల అధ్యక్షులు బొల్లారం లలిత, లక్ష్మి, మౌలాబి, ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి బుధవారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్



కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని బంగారిగడ్డ ఏఎల్ఎఫ్ నందు ఆర్పి 14 సంవత్సరములుగా విధులు నిర్వహిస్తున్న ఎక్కడ కూడా అవినీతికి పాల్పడలేదు అని అన్నారు. కొంతమంది స్వార్థం తో అసత్యాలతో కూడిన ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వారి ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. వారే కొంతమంది అధికారులకు తప్పుడు సమాచారం అందించి వారిని విధుల నుండి తొలగించడం జరిగిందని తెలిపారు. అందరిలో మంచి సేవలు అందిస్తూ ఇప్పటికీ ఎలాంటి ఆరోపణలు లేకుండా అందరి మన్ననలు పొందిన శోభనను జీర్ణించుకోలేకనే కొందరు ఈ కట్టు కథలు అల్లారని పేర్కొన్నారు. ఎలాంటి సమగ్ర విచారణ లేకుండా శోభనను విధులనుండి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. 24 సంఘాలకు సంబంధించిన ప్రతినిధుల నుండి శోభన ఎలాంటి డబ్బులు ఆశించలేదని స్పష్టం చేశారు. కొంతమంది అధికారుల కక్ష సాధింపులో భాగమే శోభన ను తొలగించడం జరిగిందని తెలిపారు. వాస్తవాలను పరిగణలోకి తీసుకొని పునర్విచారణ నిర్వహించి శోభనను విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంఘాల సభ్యులు అందరితో కలిసి మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రకాళీ అమ్మ వారిని దర్శించుకున్న కే టీ ఆర్

వరంగల్ 06 మే (సాక్ష్యం): వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఈ రోజు తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక





రామారావు సందర్శించారు. కె.టి.ఆర్ వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎం.పి వద్దిరాజు రవిచంద్ర, ఎం.ఎల్.ఏలు దాస్యం వినయభాస్కర్, తాటికొండ రాజయ్య, వొడితల సతీష్, మాలోతు కవిత తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసిన కె.టి.ఆర్ కి ఆలయ అర్చకులు పూర్ణకుంభం, మంగళవాద్యాలు, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కె.టి.ఆర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో వేదపండితులు, అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

## సింగిల్ విండో చైర్మన్ గా చింతల దామోదర్ రెడ్డి

చౌటుప్పల్ మే 6 (సాక్ష్యం ): చౌటుప్పల్ సింగిల్ విండో (పిఎసిఎస్) చైర్మన్ గా హైకోర్టు తీర్పు మేరకు చింతల దామోదర్ రెడ్డి బుధవారం మరోసారి బాధ్యతలు



చేపట్టారు. సింగిల్ విండో కార్యదర్శి వై రమేష్ చైర్మన్ గా చింతల దామోదర్ రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించి వారికి బాధ్యతలు అప్పగించారు. 2020లో ఎన్నికైన పాలక వర్గమునే ఎన్నికలు జరిగే వరకు కొనసాగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించడంతో ప్రభుత్వం పాత పాలకవర్గమునే కొనసాగిస్తూ అధికారులకు ఆదేశం ఇవ్వడంతో తిరిగి పాత పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. చైర్మన్ గా చింతల దామోదర్ రెడ్డి, సభ్యులుగా చెన్న గోని అంజయ్య గౌడ్, బోరెం నర్సిరెడ్డి, గుండెబోయిన రూపమ్మ, దూర్క కృష్ణ, పబ్బతి వెంకటయ్య, దొడ్డి శ్రీశైలం బొడ్డు పద్మ సప్పిడి వెంకట్ రెడ్డి బాతరాజు సాయిలు, పానుబోతు సూర, దోడీ బాలరాజు, దుబ్బాక శశిధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

## జర్నలిస్టులపై కేసులు ఉపసంహరించాలి

**- ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడాలి – ఎస్పీకి జర్నలిస్ట్ ల వినతి**

మహబూబ్‌నగర్, మే 6 ( సాక్ష్యం బ్యూరో): జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించాలంటూ మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాలమూరు ప్రాంతానికి చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల ముగ్గురు జర్నలిస్టులపై నమోదైన కేసుల విషయాన్ని ఎస్పీకి వివరించిన వారు, నిజాలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తించే మీడియాపై ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం ద్వారా వారి వృత్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలికి తీసి సమాజానికి దిశానిర్దేశం చేసే జర్నలిస్టులపై అకారణంగా కేసులు పెట్టడం తగదని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రతి వ్యవస్థ బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర చారి, జనరల్ సెక్రటరీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. దాదాపు 100 మంది జర్నలిస్టులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.



# విజయ్‌ను చూసి కేటీఆర్ నేర్చుకోవాలి: విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, మే 6 (సాక్ష్యం బ్యూరో): సీఎల్పీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కేటీఆర్ వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. కేసీఆర్ కేటీఆర్‌కు అనుచిత భాష వాడటం నేర్పించారని విమర్శించారు. ఇటీవల గెలిచిన విజయ్‌ను చూసి కేటీఆర్ నేర్చుకోవాలని సూచించారు. రైతు సంగ్రామ సభ పేరుతో నిర్వహించిన సమావేశంలో రైతుల సమస్యలపై మాట్లాడకుండా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడానికే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలు ఎక్కువకాలం అరాచకాలకు పాల్పడితే కాలగర్భంలో కలిసిపోయాయని, సిద్ధాంతాలతో నడిచే పార్టీలకే ప్రజలు మద్దతు ఇస్తారని అన్నారు. వారసత్వ రాజకీయాలు ఎప్పటికీ నిలవవని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు చెప్పే మాటలను తెలంగాణ ప్రజలు



నమ్మరని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పిన ఆయన, 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ ద్వారా 25 లక్షల 35 వేల మంది రైతులకు లాభం చేకూర్చామని తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా రైతన్నలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. ప్రస్తుతం నెలకు 5,200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, గత ప్రభుత్వంలో అది కేవలం 2,500 కోట్లకే పరిమితమైందని విమర్శించారు. రైతు కూలీలకు 3,000 కోట్లకు పైగా బోనస్ అందించామని తెలిపారు. గతంలో లక్ష రూపాయల రుణమాఫీని విడతల వారీగా విడుదల చేసి రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఎన్ని సార్లు అబద్ధాలు చెప్పినా అవి నిజం కావని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇలాగే విమర్శలు కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో ఎమ్మెల్యేగా గెలవలేరని హెచ్చరించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టామని, స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. ఫ్రీ బస్సు పథకం వల్ల మారుమూల గ్రామాల మహిళలు ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులు భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అన్వేష, ఆదిలాబాద్‌కు చెందిన ప్రగతి మంచి మార్కులు సాధించడానికి ఈ పథకం ఉపయోగపడిందని పేర్కొన్నారు. కేటీఆర్ తనకంటే జూనియర్ అయిన విజయ్‌ను చూసి నేర్చుకోవాలని మరోసారి సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

# కేటీఆర్ ఫస్ట్ నువ్వు నీ చెల్లెకు సమాధానం చెప్పుకో

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ 6 మే (సాక్ష్యం): మాట్లాడే భాష జాగ్రత్త..నీకంటే ఎక్కువ మాట్లాడగలం..తిట్లలో మేం డాక్టరేట్ చేశాం.. నువ్వు సాఫ్ట్ వేర్...మేము హార్డ్ వేర్ బిడ్డా.. జాగ్రత్త అంటూ బిఆర్ఎస్ యువనేత కేటీఆర్ కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఈ రోజు నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించిందని, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రైతు రుణమాఫీ వంటి కీలక నిర్ణయాలను అమలు చేశామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేకపోయింది. ఇప్పుడు రెండేళ్లలోనే అమలు చేస్తున్న మా ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదు అని రాష్ట్రంలో అశాంతి సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలను ప్రభుత్వం సహించబోదని హెచ్చరించారు. కేటీఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని అసత్య ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అవసరమైతే ప్రజల ముందు ఓపెన్ చర్చకు సిద్ధమని, రైతులకు ఎవరు ఏమి చేశారో చర్చిద్దామని సవాల్ విసిరారు. రైతు రుణమాఫీ 80 శాతం పైగా పూర్తి చేశాం.

ధాన్యం కొనుగోలు వ్యవస్థను మెరుగుపరచి రైతులకు న్యాయం చేస్తున్నమని గతంలో రైతులకు నకిలీ విత్తనాల సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఎయిర్‌పోర్ట్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వంటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు. ప్రతిపక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. నిర్మాణాత్మక సూచనలు ఇస్తే స్వాగతిస్తాం. కానీ అసత్య ప్రచారం, అవమానకర వ్యాఖ్యలు చేస్తే కఠినంగా ఎదుర్కొంటాం అని హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ నాయకులు, డీసీసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాల ఆశీస్సుల తో శక్తి మేరకు కృషి చేశాం, ఇంకా ఎంతో చేయాలి

### గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి చివరి సమావేశంలో కార్పొరేటర్ లు

వరంగల్,06 మే (సాక్ష్యం): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2022-26 పాలకమండలి పదవీకాలం బుధవారంతో పూర్తి కావడంతో చివరి సమావేశం మేయర్ ముందు సుధారాణి, ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని




రాజేందర్‌రెడ్డి, కె ఆర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లు పాల్గొని వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పదవి కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, కొనసాగుతున్న కార్యక్రమాలను గురించి ప్రస్తావించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగేందుకు ప్రభుత్వం అధికారులు సహకరించాలని ఏ ఆటంకం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో ఉన్న విలీన గ్రామాలతో సహా తమరు ఎన్నుకున్న ప్రజలను మెప్పించడంలో కార్పొరేషన్ సహకారంతో ప్రభుత్వ నిధులతో కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ స్మార్ట్ సిటీ నిధులు, హెరిటేజ్ నగరాల అభివృద్ధి ప్రసిద్ధి చెందిన ప్రాంతాల అభివృద్ధికి మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీల సహకారంతో అవకాశం మేరకు కృషి చేసినట్లు తెలిపారు. నగరంలో వర్షాల కారణంగా దెబ్బతింటున్న ముంపు ప్రాంతాలను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంచినీటి సప్లై మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నదని అలాగే నగరంలోని నిరుపేదలకు వివిధ ప్రాంతాల్లో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు



తీసుకోవాలని వెనుకబడ్డ మురికివాడ ప్రాంతాలు ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పరచాలని తామున్నా లేకున్నా ప్రభుత్వంలో ఎవరన్నా ప్రజల కష్టాలు తీర్చడంలో ముందుండాలని ఈ సందర్భంగా తమను ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంతకాలం తమకు సహకరించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రజలకు పారిశుధ్య సిబ్బందికి వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ చివరి సమావేశంలో కార్పొరేటర్లు బస్వరాజు కుమార్ స్వామి, సురేష్ కుమార్ జోషి, కావటి కవిత, జన్ను, శిభారాణి, వేల్పుగొండ సువర్ణ, చీకటి శారద ఆనంద్, జక్కుల రవి, గురుమూర్తి శివకుమార్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వివిధ డివిజన్లో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, సాక్ష్యం న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కంటంగూడెం గ్రామం, గుండాల మండలం పెద్దపడిశాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న



రైతులతో మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ప్రతిపక్షాలు తిన్నది అరగక ధర్నా చేస్తున్నారని హెద్దవా చేశారు.అనంతరం బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించిన రైతు సభలో ప్రజాపాలన ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను బీర్ల అయిలయ్య తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య రైతుల సమస్యలపై మళ్ళీ మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కేటీఆర్ పై మండి పడ్డారు. గత పది సంవత్సరాల పాటు రైతులను పూర్తిగా విస్మరించిన వారు, ఇప్పుడు రైతు సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంతా కలసి కేటీఆర్‌ను తిరస్కరించి అధికారంలో నుండి దింపిన తర్వాత కూడా ఆయన అహంకారం తగ్గలేదని పేర్కొన్నారు. వరంగల్‌లో రైతు సభ ఏర్పాటు చేసి రైతులను ఉద్ధరించినట్లు మాట్లాడటం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. కేటీఆర్ తగిన అవగాహన లేకుండా బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్ సందర్భంగా భావి ప్రధాని రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు హామీల మేరకు రైతులకు రుణమాఫీ అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వరంగల్ డిక్లరేషన్ సాక్షిగా రైతులంతా కేటీఆర్‌ను తిరస్కరించి ఫామ్ హౌస్ రాజకీయాలకు పరిమితం చేసినా ఆయనకు ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. గతంలో రైతులకు బేడీలు వేసిన వారు మీరు కాదా అని ప్రశ్నిస్తూ, అప్పులు చేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన మీ తప్పులను మేము ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.తెలంగాణ



రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయడం ద్వారా ప్రభుత్వ నిబద్ధతను చాటుకున్నామని తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ఏ ముఖం పెట్టుకొని వరంగల్‌లో రైతు సభ నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు

.రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల పట్ల ప్రజాపాలన ప్రభుత్వం చూపుతున్న కట్టుబాటును ప్రజలు విశ్వసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు చిల్లర మాటలు మాట్లాడుతున్నాయని విమర్శించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని గౌరవించకుండా అనవసర వ్యాఖ్యలు చేయడం అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు అందరూ ప్రజాపాలన ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షాలు అసహనంతో వ్యవహరిస్తున్నాయని అన్నారు. మీ ప్రభుత్వం కూలిపోయిన తరువాత జరిగిన ఏ ఎన్నికలోనూ విజయం సాధించలేకపోయినా మీ ధోరణి మారలేదని, ప్రజలు నిజాన్ని గుర్తించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారని స్పష్టం చేశారు.

# రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది

**- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**

చౌటుప్పల్ మే 6(సాక్ష్యం): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. బుధవారం చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మార్కెట్ యార్డ్‌లో





"ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పలు అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా వాణిజ్య పంటల మార్పిడి, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మార్కెటింగ్ శాఖ ద్వారా తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, ఆటోమేటిక్ వడ్లు పట్టే యంత్రాలు, మ్యాచర్ మీటర్లు వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే మార్కెటింగ్ శాఖ ప్రాముఖ్యత, రైతు బంధు, రైతు భీమా పథకాలపై వివరించారు. అనంతరం ఆదర్శ రైతులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావణి రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, పి ఎ సి ఎస్ వైస్ చైర్మన్ చేనగోని అంజయ్య, ఎ డి ఎ వెంకటేశ్వర్లు, ఎమ్ ఎ ఓ నాగరాజు,ఆర్ ఐ సుధాకర్ రావు, కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ భాగ్యశ్రీ, కోఆపరేటివ్ సొసైటీ అధికారి సురేష్,ఎ ఈ ఓ శ్రావ్య, మార్కెట్ కమిటీ సభ్యులు డిల్లీ చంద్రకళ, పబ్బు శ్రీకాంత్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, మార్కెట్ కమిటీ కార్యదర్శి వి. రవీందర్ రెడ్డి, ఎ పి ఎమ్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువత జాబ్ మేళా ఉపయోగించుకోవాలి

### కలెక్టర్ సత్య శారద

వరంగల్,06 మే (సాక్ష్యం): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ శుక్రవారం కాళోజి కళా



క్షేత్రంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 కంపెనీలు ఉద్యోగ అవకాశాల కల్పనకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ నిఖిత బోగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై వి గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రమేష్, జిఎం ఇండస్ట్రియల్ నరసింహ మూర్తి సంబంధిత అధికారులు, యూత్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మక్కులు కొని రైతులను ఆదుకోండి: ఎమ్మెల్యే

జగిత్యాల,మే6(సాక్ష్యం): మీకు పాదాభివందనం చేస్తాం. దయచేసి మక్కలు కొనండి అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అధికారులను వేడుకున్నారు. కొన్ని రోజులుగా కల్లాల్లోనే మక్కలు పేరుకుపోవడం, వర్షాలకు తడిసి ముద్దవుతుండంతో ఆయన మక్కజొన్న కొనుగోలు చేయాలని మార్క్ ఫెడ్ డీఎంకు ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సంజయ్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలు విషయంలో గత నాలుగు వారాలుగా జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. లారీలు పంపించండి.. నేను మోస్తా, లేదంటే మా కార్యకర్తలను మోస్తారని అధికారులకు సూచించారు. మీరు లారీలు పంపించండని ఎమ్మెల్యే కోరారు.



# ఫైనల్ మ్యాచ్ వేదిక మార్పు..

ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ వేదిక అధికారికంగా ఖరారైంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుహోమ్ గ్రౌండ్ అయిన బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన టైటిల్ పోరును బీసీసీఐ అనూహ్యంగా అహ్మదాబాద్‌కు మార్చింది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానంగా పేరొందిన నరేంద్ర మోదీ స్టేడియం మే 31న జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. వాస్తవానికి ప్రతి ఏడాదీ గతేడాది విజేతగా నిలిచిన జట్టు సొంత మైదానంలో ఫైనల్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈ ఏడాది ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టారు. స్థానిక క్రికెట్ అసోసియేషన్, అధికారుల నుంచి వచ్చిన కొన్ని డిమాండ్లు తమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఆ కారణం వల్లే ఫైనల్ వేదికను అహ్మదాబాద్‌కు మార్చామని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా వెల్లడించారు. ప్లేఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను బోర్డు బుధవారం విడుదల చేసింది. గత ఐదేళ్లలో అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరగడం ఇది నాలుగోసారి కావడం విశేషం. మే 26 నుంచి ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. వేదిక మార్పుపై బీసీసీఐ చేసిన ప్రకటనలో నిబంధనలకు విరుద్ధమైన డిమాండ్ల గురించి ప్రస్తావించారే తప్ప, అసలు కారణం ఏమిటో నేరుగా చెప్పలేదు. అయితే పలు నివేదికల ప్రకారం చూస్తే, స్థానిక రాజకీయ నాయకుల నుంచి వచ్చిన అసాధారణ డిమాండ్ల వల్లే ఈ మార్పు జరిగినట్లు స్పష్టమవుతోంది. ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు ముందే కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయనంద్ కాశప్పనవర్ బహిరంగంగానే వీఐపీ పాస్‌ల డిమాండ్ తెరపైకి తెచ్చారు. ప్రజాప్రతినిధులమైన తాము క్యూలో నిలబడలేమని, ప్రతి ఎమ్మెల్యేకు కనీసం ఐదు ఐపీఎల్ టికెట్లు ఇవ్వాలని ఆయన పట్టుబట్టారు. ఆ తర్వాత వెంటనే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం ఎంపీలు, ఎమ్మెల్యేలకు మ్యాచ్‌కు మూడు ఉచిత టికెట్ల చొప్పున కేటాయిస్తామని వెల్లడించారు. బీసీసీఐ ఈ వ్యవహారంపై నేరుగా స్పందించనప్పటికీ, వేదికను మార్చడం వెనుక ఉన్న అసలు కారణం ఇదేనని క్రీడా వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. నల్ మ్యాచ్ కోసం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియాన్ని ఎంచుకోవడానికి బలమైన కారణాలే ఉన్నాయి. అత్యధిక సీటింగ్ సామర్థ్యం ఉన్న ఈ మైదానం ఇప్పటికే ఎన్నో ప్రతిష్టాత్మక మ్యాచ్‌లకు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చింది. ఇక్కడ అత్యుత్తమ మౌలిక సదుపాయాలు ఉండటంతో పాటు, బయటి వ్యక్తుల నుంచి అనవసరమైన ఒత్తిళ్లు తక్కువగా ఉంటాయి. భారీ అంచనాలు ఉండే ఫైనల్ లాంటి మ్యాచ్‌ను సురక్షితమైన, నియంత్రిత వాతావరణంలో నిర్వహించడానికి బీసీసీఐకి ఇది సరైన వేదికగా మారింది. ఒక రకంగా చెప్పాలంటే, ఈ వేదిక మార్పు కేవలం సౌలభ్యం కోసమే కాకుండా, నిర్వహణపై తమకు పూర్తి పట్టు ఉండేలా బోర్డు తీసుకున్న జాగ్రత్తగా పరిగణించవచ్చు. ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ పూర్తి షెడ్యూల్ ఈ విధంగా ఉంది. లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య మే 26న ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో క్వాలిఫయర్-1 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత మే 27న న్యూ చండీగఢ్‌లోని న్యూ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడతాయి. అదే మైదానంలో మే 29న క్వాలిఫయర్-2 జరగనుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు ఈ మ్యాచ్‌లో ఫైనల్ బెర్త్ కోసం పోటీపడతాయి. ఇక విజేతను నిర్ణయించే గ్రాండ్ ఫైనల్ మే 31న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో అట్టహాసంగా జరగనుంది. ఈ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లను మూడు వేర్వేరు నగరాల్లో నిర్వహించడం ఈ సీజన్‌లో తీసుకున్న ప్రత్యేక నిర్ణయమని, బెంగళూరు వ్యవహారం వల్లే ఈ రకమైన మార్పులు చేయాల్సి వచ్చిందని బోర్డు వివరించింది.

## ఎప్పుడు ఎవరికి బౌలింగ్ ఇవ్వాలో నాకు బాగా తెలుసు: రోహిత్ శర్మ

మైదానంలోకి దిగితే పరుగులు వరద పారించే స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు మతిమరుపు ఉంటుందని, విలువైన వస్తువులను సైతం మర్చిపోతుంటాడని తన టీమ్‌మేట్స్ ఇప్పటికే అనేక సందర్భాల్లో చెప్పారు. తాజాగా అతడి మతిపరుపు విషయం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే తాను వస్తువులనే మర్చిపోతానని, గేమ్ స్ట్రాటజీని కాదని, ముఖ్యమైన విషయాలు కచ్చితంగా గుర్తుంటాయని అన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రోహిత్ శర్మ ప్రస్తుతం ఐపీఎల్‌లో బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలో అతడు ముంబయి ఇండియన్స్ జట్టు సభ్యులు సూర్యకుమార్, తిలక్ వర్మ, రికెల్టన్, జస్ప్రీత్ బుమ్రా, విల్ జాక్స్‌కో కలిసి తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లో రోహిత్ మతిమరుపుతో తాజాగా తనకు ఎదురైన సందర్భం గురించి యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ షేర్ చేసుకున్నాడు. ఈసారి రోహిత్ ఫోన్ మర్చిపోయాడని చెప్పాడు. 'ఇటీవల మేం జామ్‌నగర్‌లోని వంతారకు వెళ్లాం. ఈ క్రమంలో రోహిత్ భయ్యా ఫ్యామిలీతోపాటు మాకంటే ముందే దిల్లీకి చేరుకున్నాడు. దీంతో నేను భయ్యాకు ఫోన్ చేస్తున్నా. కానీ లిఫ్ట్ చేయడం లేదు. అయితే నేను వంతారకు చేరుకున్నాక, 'ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయట్లేదు?' అని తనను అడిగితే 'ఫోన్ ఇంట్లో మర్చిపోయి వచ్చాను' అని చెప్పాడని అన్నాడు. దీంతో ఈవెంట్‌లో ఒక్కసారిగా అంతా నవ్వేశారు. దీనిపై రోహిత్ స్పందించాడు. 'హా! నేను అప్పుడప్పుడు వస్తువులు మర్చిపోతుంటానని అంగీకరిస్తాను. ఇక్కడ కూర్చొని నవ్వుతున్నవాళ్లు కూడా ఎప్పుడో ఒక సందర్భంలో ఏదో ఒకటి మర్చిపోయే ఉంటారు. అది కామన్. కానీ, ఏ సందర్భంలో ఏది ముఖ్యమైన విషయమో అది నేను కచ్చితంగా గుర్తుపెట్టుకుంటాను. ఎప్పుడు ఎవరికి బౌలింగ్ ఇవ్వాలి? ఎవరిని ఎప్పుడు బ్యాటింగ్‌కు పంపాలి? అనే విషయాలు పక్కా గుర్తుంటాయి' అని రోహిత్ అన్నాడు. ముంబయి రీసెంట్‌హా వాంఖడే వేదికగా మ్యాచ్ ఆడింది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు మైదానంలో రోహిత్ ప్రాక్టీస్ చేస్తుండగా, అతడు బాదిన ఓ బంతి అక్కడే పని చేస్తున్న గ్రౌండ్ స్టాఫ్‌కు తగిలింది. మోకాలికి బంతి బలంగా తాకడంతో గ్రౌండ్ స్టాఫ్ మెంబర్ అక్కడే కిందపడ్డాడు. దీంతో రోహిత్ ప్రాక్టీస్ మధ్యలోనే ఆపేసి అతడి వద్దకు వెళ్లి పరిస్థితిని కనుక్కున్నాడు. దీనికి సంబంధించిన వీడియోను ముంబయి తన ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేసింది. గ్రౌండ్‌స్టాఫ్ పట్ల రోహిత్ చూపిన కేర్, గౌరవాన్ని అభిమానులు ప్రశంసిస్తున్నారు.






## చరిత్ర సృష్టించిన సంజూ సామ్సన్..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 రసవత్తరంగా మారిపోయింది. లీగ్ దశ ఆఖరికి చేరుకున్నా.. 10 జట్లకు కూడా ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో, ముంబై జట్లకు కాస్త కష్టమైనా అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నాయి. ఇక ఆరంభంలో ఇబ్బంది పడ్డ చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం దూకుడు మీద ఉంది. ప్లేయింగ్ ఎలెవెన్ సెట్ అవ్వడంతో పాటు నిలకడగా ఆడుతూ ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నెగ్గిన చెన్నై సూపర్ కింగ్స్ పాయింట్ల పట్టికలో 6వ స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం 10 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. 5 ఓటములతో 10 పాయింట్లు సాధించిన చెన్నై సూపర్ కింగ్స్ 6వ స్థానంలో నిలిచింది. ఇక ఈ మ్యాచ్‌లో సంజూ సామ్సన్ రెచ్చిపోయాడు. తద్వారా ఎవరికీ సాధ్యం కాని రికార్డును సాధించాడు. ఈ మ్యాచ్‌లో సంజూ సామ్సన్ 52 బంతుల్లో 87 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 7 ఫోర్లు.. 6 సిక్సర్లు ఉన్నాయి. ఇప్పటికే రెండు సెంచరీలు బాదాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున తొలి సీజన్ ఆడుతున్న సంజూ సామ్సన్ ఆరంభంలో ఇబ్బంది పడ్డా.. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సంజూ సామ్సన్ నిలబడి ఆడిన ప్రతిసారి కూడా చెన్నై గెలవడం విశేషం. ఇక ఢిల్లీతో జరిగిన పోరులో కార్తీక్ శర్మ (31 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి అజేయమైన 3వ వికెట్‌కు 66 బంతుల్లో 114 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో ఎవరికీ సాధ్యం కాని రికార్డును సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ఒకే జట్టుపై రెండుసార్లు 100 లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్యాలు నెలకొల్పిన తొలి బ్యాటర్‌గా సంజూ సామ్సన్ చరిత్ర నెలకొల్పాడు. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన తొలి అంచె పోరులో ఆయుశ్ మాత్రేతో కలిసి సంజూ సామ్సన్ 113 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రుతురాజ్ గైక్వాడ్ కూడా ఢిల్లీపై రెండుసార్లు 100 లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అయితే అతడు రెండు సీజన్లలో ఈ ఘనత సాధించాడు. సంజూ సామ్సన్‌లా ఒకే సీజన్‌లో సాధించలేదు. ఈ మ్యాచ్‌లో సంజూ సామ్సన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 155 పరుగులు చేసింది. సమీర్ రిజ్వీ (24 బంతుల్లో 40 నాటౌట్; 4 సిక్సర్లు), ట్రిస్టాన్ స్టబ్స్ (38) మినహా మిగిలిన బ్యాటర్లు దారుణంగా విఫలం అయ్యారు. నూర్ అహ్మద్‌కు 2 వికెట్లు లభించాయి.అనంతరం లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ 17.3 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 159 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (6), ఉర్విల్ పటేల్ (17)లు విఫలం అయినా సంజూ సామ్సన్, కార్తీక్ శర్మలు మ్యాచ్‌ను ఫినిష్ చేశారు. ఈ విజయంతో చెన్నై సూపర్ కింగ్స్ పాయింట్ల పట్టికలో 6వ స్థానానికి చేరుకుంది. ఢిల్లీ 8 పాయింట్లతో 7వ స్థానంలో కొనసాగుతుంది.

# వ్యాపారాలు, పెట్టుబడులపై ధోని దృష్టి

క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరుగాంచిన ఎంఎస్ ధోని, రిటైర్మెంట్ తర్వాత తన దృష్టిని పూర్తిగా వ్యాపారాలు, పెట్టుబడులపై కేంద్రీకరించాడు. సాధారణంగా సెలబ్రిటీలు రియల్ ఎస్టేట్ లేదా సినిమా రంగాల్లో పెట్టుబడులు పెడతారు. కానీ, ధోని మాత్రం భవిష్యత్తు ఉన్న స్టార్టప్‌లు, స్టాక్ మార్కెట్ రంగాలను ఎంచుకున్నాడు. ఆయన ఎంచుకున్న కంపెనీలు ఇప్పుడు మల్టీబ్యాగర్లుగా మారి ఇన్వెస్టర్లను ఆశ్చర్యపరుస్తున్నాయి. ముఖ్యంగా డ్రోన్ తయారీ, ఈ-కామర్స్ రంగాల్లో ఆయన చేసిన పెట్టుబడులు ఇప్పుడు భారీ లాభాలను తెచ్చిపెడుతున్నాయి. ధోని పోర్ట్‌ఫోలియోలో అత్యంత కీలకమైనది 'గరుడ ఏరోస్పేస్'. ఈ చెన్నైకి చెందిన డ్రోన్ స్టార్టప్‌లో ధోని కేవలం బ్రాండ్ అంబాసిడర్‌గానే కాకుండా భారీగా పెట్టుబడి పెట్టారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న తరుణంలో, ఈ కంపెనీ విలువ అనూహ్యంగా పెరిగింది. ధోని సుమారుగా ఒక కోటి రూపాయలకు పైగా ఈ కంపెనీలో ఇన్వెస్ట్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ కంపెనీ ఐపీఓ కి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం, ఈ కంపెనీ లిస్టింగ్ అయిన తర్వాత ధోని పెట్టిన పెట్టుబడి పది రెట్లు పెరిగే అవకాశం ఉంది. చిన్న వ్యాపారుల కోసం డిజిటల్ లెడ్జర్ సేవలను అందించే 'ఖాతాబుక్' యాప్‌లో ధోని 2020లో పెట్టుబడి పెట్టాడు. ఈ సంస్థలో



ఆయన వాటా కోట్లాది రూపాయల విలువ చేస్తుంది. అదేవిధంగా, సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయ సంస్థ 'కార్స్ 24' లో కూడా ధోని భాగస్వామిగా ఉన్నాడు. కేవలం ప్రచారం కోసమే కాకుండా, కంపెనీ వ్యూహాల్లో కూడా ఆయన భాగస్వామ్యం వహిస్తుంటాడు. ఈ రెండు సంస్థలు ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో అగ్రగామిగా కొనసాగుతుండటంతో ధోని సంపద నిలకడగా పెరుగుతోంది. స్టాక్ మార్కెట్లోకి అరంగేట్రం చేసిన 'డ్రోన్ ఆచార్య ఏరియల్ ఇన్నోవేషన్స్' షేర్లను ధోని ప్రీ-ఐపీఓ దశలోనే కొనుగోలు చేశాడు. ఆయన సుమారుగా 6,600 షేర్లను ఒక్కో షేరు 54 రూపాయల ధర (మొత్తం రూ. 3,56,400) వద్ద కొనుగోలు చేశాడు. లిస్టింగ్ రోజునే ఈ షేరు ధర 100 రూపాయల మార్కును దాటి ఇన్వెస్టర్లకు బంపర్ లాభాలను ఇచ్చింది. ప్రస్తుతం ఈ షేరు విలువ ధోని కొన్న ధర కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం ఆయన దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహానికి నిదర్శనం. స్టాక్ మార్కెట్ పెట్టుబడులే కాకుండా, రాంచీలోని తన సొంత ఫామ్ హౌస్‌లో ధోని సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. అక్కడ పండించే కూరగాయలు, పండ్లను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. దీనికి తోడు 'సెవెన్' (7) అనే బ్రాండ్ ద్వారా దుస్తులు, పాదరక్షల వ్యాపారంలోనూ ఆయన రాణిస్తున్నారు. ఫిట్‌నెస్ రంగంలో 'ధోని స్పోర్ట్స్ ఫిట్' జిమ్‌ల నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విస్తరించి ఉంది. ధోని పెట్టుబడుల సరళిని గమనిస్తే ఆయన ఎప్పుడూ స్వల్పకాలిక లాభాల కోసం వెంపర్లాడరని అర్థమవుతుంది. భవిష్యత్తులో ఏ రంగానికి డిమాండ్ ఉంటుందో ముందే ఊహించి, ఆయా రంగాల్లోని నమ్మకమైన కంపెనీల్లో పెట్టుబడి పెట్టాడు. క్రమశిక్షణ, సహనం, సరైన విశ్లేషణ ఉంటే స్టాక్ మార్కెట్‌లో ఎవరైనా విజయం సాధించవచ్చని ఆయన నిరూపిస్తున్నాడు. ప్రస్తుతం ధోని మొత్తం ఆస్తుల విలువ 1000 కోట్ల రూపాయలు దాటినట్లు అంచనా, అందులో గణనీయమైన భాగం ఇలాంటి స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ల ద్వారానే సమకూరింది.

# మెడల్ సాధించినా బ్యాడ్మింటన్‌కు గుర్తింపు లేదు.. భారత స్టార్ షట్లర్ సాత్విక్ నిరాశ!

2026 థామస్ కప్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించినప్పటికీ తమకు తగిన గుర్తింపు దక్కలేదని భారత స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పతకం సాధించి స్వదేశానికి వస్తే, ఎయిర్‌పోర్టులో కనీసం స్వాగతం కూడా లభించలేదని అన్నాడు. అభిమానులు ఎవరు కూడా స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు రాకపోవడం తనను ఎంతో బాధించిందని సాత్విక్ అన్నాడు. అందుకే భవిష్యత్తులో తన పిల్లలను బ్యాడ్మింటన్ ఆడించనని తెలిపాడు. బ్యాడ్మింటన్‌కు గుర్తింపు లభించడం లేదని సాత్విక్ అభిప్రాయపడ్డాడు. దేశ ప్రజలు కూడా ప్రస్తుతం క్రికెట్ (ఐపీఎల్), రాజకీయాలపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారని అన్నాడు. ఈ పరిణామాలు చూస్తుంటే, భారత్‌లో బ్యాడ్మింటన్ ఆటను ప్రొఫెషనల్ గేమ్‌గా చూడడం లేదా? అనే సందేహం కలుగుతుందని అన్నాడు. ఈ మేరకు తాజాగా డెన్మార్క్ నుంచి భారత్‌కు వచ్చిన సాత్విక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ఏడు గంటలు జర్నీ చేసి జర్మనీ నుంచి హైదరాబాద్ చేరుకున్నాం. మేం థామస్ కప్ జెర్సీలను ధరించి ఉన్నాం. అయినప్పటికీ జర్మనీ ఎయిర్‌పోర్ట్‌లో ఒక్కరు కూడా మీరెవరు? ఆ పతకాలు ఏంటి? అని కూడా మమ్మల్ని అడగలేదు. అక్కడ ఇండియన్స్, అందులో కొందరు మన తెలుగు వాళ్లు కూడా ఉన్నారు. అయితే ప్రస్తుతం అందరూ ఐపీఎల్, పాలిటిక్స్ పైనే దృష్టి పెడుతున్నారు. వాటితోనే బిజీగా ఉన్నారు. మేం 2022లో గోల్డ్ మెడల్ తీసుకొచ్చాం. అప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొన్నాం. కానీ ఇలాంటి గొప్ప విజయాలు సాధించినప్పుడు ఘనంగా సంబరాలు చేసుకోవాలని ఉంటుంది"ఇంకో విషయం ఏంటంటే, ఇక్కడ ఎయిర్‌పోర్టులో కూడా మమ్మల్నిన ఎవరూ గుర్తించలేదు. జట్టులోని ఆటగాళ్లు శ్రీకాంత్, ప్రణయ్, ధ్రువ్ ఇలా అందరూ ఎయిర్‌పోర్ట్‌కు రాగానే ఎవరి క్యాబ్ వాళ్లే బుక్ చేసుకుని వెళ్లిపోయారు. నాకోసం నా ఫ్రెండ్స్ వచ్చారు. స్టార్ అథ్లెట్లు కూడా క్యాబ్స్ బుక్ చేసుకుంటూ కనిపించారు. ప్రస్తుతం ఇలా ఉంది పరిస్థితి. కానీ సంబరాలు చేసుకునే అవకాశాలు తరచూ రావు. అది అభిమానులకు తెలియడం లేదు' అని సాత్విక్ అన్నాడు.' బ్యాడ్మింటన్ టోర్నీల్లో కాంపిటీషన్ తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి టోర్నీల్లో గాయపడితే, రిప్లేస్‌మెంట్‌గా ఆడేందుకు ఇంకో ప్లేయర్ ఉండదు. ముఖ్యంగా టీమ్ ఈవెంట్స్‌లో చాలా ఒత్తిడి ఉంటుంది. సపోర్ట్ కూడా ఉండదు. అయినప్పటికీ పతకాలు గెలిచినా గుర్తింపు ఉండడం లేదు. అందుకే ఫ్యూచర్‌లో 'నా పిల్లలను బ్యాడ్మింటన్ ఆడించను' అని ఓ సందర్భంలో ప్రణయ్ చెప్పాను. మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటే ఫర్వాలేదు కానీ, ఎంత గొప్ప ప్రదర్శన చేసినా గుర్తింపు ఉండకపోతే చాలా బాధగా ఉంటుంది. ఎంత సాధించినా, హైదరాబాద్ అకాడమీలో కేక్ కట్ చేయడం వరకే సంబరాలు పరిమితమవుతున్నాయి' అని సాత్విక్ వెల్లడించాడు. కాగా, డెన్మార్క్ వేదిగా ఇటీవల ముగిసిన థామస్ కప్ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ పోటీలో భారత్ మూడో స్థానంలో నిలిచి, బ్రాంజ్ మెడల్ దక్కించుకుంది. ఫైనల్‌లో ఫ్రాన్స్‌ను ఓడించిన చైనా గోల్డ్ మెడల్ సాధించింది. ఇక 2022లో భారత్ స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించింది. థామస్ కప్‌లో భారత్ గోల్డ్ దక్కించుకోవడం అదే తొలిసారి!



# 'బ్యూటీ విత్ బ్రెయిన్స్' అనిపించుకోవడమే నా లక్ష్యం

## "M4M" మూవీ హీరోయిన్ జో శర్మతో (Jo Sharma) ఇంటర్వ్యూ

- "M4M (మోటివ్ ఫర్ మర్డర్)" హైలైట్స్ చెప్పిన హీరోయిన్
- ఇలాంటి కాన్సెప్ట్ ప్రపంచంలోనే ఎక్కడా రాలేదు
- రిలీజ్‌కు ముందే 15 ఇంటర్నేషనల్ అవార్డులు
- మే 8న "M4M (మోటివ్ ఫర్ మర్డర్)" విడుదల
- 5 భాషల్లో విడుదలకు సిద్ధమైన "M4M" మూవీ
- సినిమాలో విలన్ ఎవరో చెబితే రూ. లక్ష ప్రైజ్ మనీ

ఇండియన్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన మూవీ "M4M (మోటివ్ ఫర్ మర్డర్)". అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ M4M (Motive For Murder) చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. PVR Inox Pictures ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ మూఈలో ప్రధాన పాత్రలో నటించిన అమెరికన్ నటి జో శర్మ మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. సినిమా గురించి, తన కెరీర్ గురించి ఈ భామ చెప్పిన విశేషాలు ఇవి..

**ప్రశ్న: మీ గురించి, మీ అప్‌కమింగ్ మూవీ గురించి చెప్పండి**

జో శర్మ: అందరికీ నమస్కారం. నా పేరు జో శర్మ. నేను శాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా) నుంచి వచ్చాను. Tollywood, బాలీవుడ్ తరహాలో వస్తున్న నా డెబ్యూ మూవీ "M4M (మోటివ్ ఫర్ మర్డర్)". ఈ సినిమా తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదలవుతోంది. మోహన్ వడ్లపట్ల గారు ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు 'రాధ', నేను ఒక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా కనిపిస్తాను.

**ప్రశ్న: అమెరికా నుంచి వచ్చి ఇక్కడ సినిమా చేయడానికి మీకు ఉన్న అనుభవం ఏంటి?**

జో శర్మ: నేను అమెరికాలో థియేటర్ ఆర్టిస్ట్‌ని, నాకంటూ ఒక థియేటర్ ప్రొడక్షన్ కంపెనీ కూడా ఉంది. మోహన్ గారి దగ్గర మూడేళ్లు శిక్షణ తీసుకున్నాను. ఈ సినిమాకి మోహన్ గారు, రాహుల్ అడవల గారితో కలిసి నేను కో-రైటర్‌గా కూడా పనిచేశాను. కథా చర్చల్లో పాల్గొనడం వల్ల నా పాత్రను చాలా బలంగా డిజైన్ చేసుకున్నాను.

**ప్రశ్న: రిలీజ్‌కు ముందే ఈ సినిమాకి చాలా అవార్డులు వచ్చినట్లున్నాయి, ఆ విశేషాలు?**

జో శర్మ: అవును, సినిమా ఇంకా రిలీజ్ కాకముందే మాకు 15 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు వచ్చాయి. లాస్ ఏంజెల్స్



ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ ఫిలిం, లండన్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ డైరెక్టర్, న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ యాక్ట్రెస్, హాలీవుడ్, శాంటా మోనికా తదితర ఫిలిం ఫెస్టివల్స్‌లో ఉత్తమ నటిగా నాకు, ఉత్తమ దర్శకుడిగా మోహన్ గారికి అవార్డులు వచ్చాయి. ముఖ్యంగా ప్రతిష్టాత్మక 'కేన్స్' (Cannes) ఫిల్మ్ ఫెస్టివల్‌లో మా సినిమా గ్లోబల్ ప్రీమియర్ వేశారు. అక్కడ తెలుగు సినిమాను సబ్-టైటిల్స్‌తో చూసిన విదేశీయులు కూడా ఆశ్చర్యపోయి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. అది మాకు దక్కిన చాలా గొప్ప గౌరవం. అక్కడ మా సినిమాకు వచ్చిన స్పందన ఎంతో ఆత్మవిశ్వాసం కలిగించింది.

**ప్రశ్న: ఈ సినిమా కథలో ఉన్న ప్రధానమైన సస్పెన్స్ లేదా కొత్తదనం ఏమిటి?**

జో శర్మ: ఇది ఒక మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇందులో ఒక సీరియల్ కిల్లర్ ఉంటాడు. అతను హత్యలు చేసిన తర్వాత, ఆ మృతదేహాలను రాజా రవివర్మ, పికాసో లాంటి గొప్ప పెయింటర్ల పెయింటింగ్స్ (కళాఖండాల) తరహాలో డెకరేట్ చేస్తాడు. ఇలాంటి కాన్సెప్ట్ ప్రపంచంలోనే ఎక్కడా రాలేదు. ప్రతి సీన్ చాలా గ్రిప్పింగ్‌గా, సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌లా సాగుతుంది. సినిమాలో హీరోగా ఏసీపీ కృష్ణ పాత్ర ఉంటుంది. విడుదల రోజు ఈ సినిమాలో విలన్ ఎవరో చెబితే లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించాము.

**ప్రశ్న: ఈ చిత్ర నిర్మాణం గురించి?**

జో శర్మ: ఈ చిత్రాన్ని మోహన్ మీడియా క్రియేషన్స్ మరియు మెక్ క్వీన్ గ్రూప్ అమెరికా వారు సంయుక్తంగా నిర్మించారు. ఒక లక్ష డాలర్ల బడ్జెట్ స్థాయికి చేరుకుని, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించాం. షూటింగ్ అంతా దాదాపు హైదరాబాద్‌లోనే జరిగింది. సంగీతం చెన్నైకి చెందిన వసంత్ ఇసైపట్టాయ్ అందించారు.

**ప్రశ్న: మీ నేపథ్యం ఏంటి? మీకు తెలుగు ఎలా వస్తుంది?**

జో శర్మ: నేను పుట్టింది హైదరాబాద్‌లోనే. కానీ పెరిగింది నాగ్‌పూర్, ముంబైలో. అందుకే నాకు తెలుగుతో పాటు మరాఠీ, హిందీ బాగా వస్తాయి. మా అమ్మానాన్నలది విజయవాడ, గుంటూరు ప్రాంతాలు.

**ప్రశ్న: టాలీవుడ్‌లో మీకు ఇష్టమైన హీరోలు ఎవరు? భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు?**

జో శర్మ: నాకు చిరంజీవి గారు, బాలకృష్ణ గారు, నాగార్జున గారు, వెంకటేష్ గారు అంటే చాలా ఇష్టం. ఇక ప్రభాస్ గారు 'బాహుబలి'తో టాలీవుడ్ ఇమేజ్‌ని మార్చేశారు. రామ్ చరణ్ గారు, అల్లు అర్జున్ గారు, మహేష్ బాబు గారు అందరూ ఇష్టమే. జూనియర్ ఎన్టీఆర్ గారి డైలాగ్ డెలివరీ, యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. నాకు డ్యాన్స్ అండ్ యాక్టింగ్ అంటే ప్రాణం కాబట్టి, రాబోయే సినిమాల్లో మంచి గ్లామర్ అండ్ యాక్షన్ రోల్స్ చేయాలని ఉంది.

**ప్రశ్న: మీ టైటిల్ కి అర్థం ఏమిటి? ప్రేక్షకులకి ఏం చెప్పాలనుకుంటున్నారు?**

జో శర్మ: M4M అంటే "మోటివ్ ఫర్ మర్డర్" (Motive For Murder). ఈ హత్యల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి అనేది అసలు పాయింట్.
ఈ టైటిల్‌కే అందరూ కనెక్ట్ అవుతున్నారు. ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది. నన్ను, మా టీమ్ అందరినీ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. బ్యూటీ విత్ బ్రెయిన్స్ అనిపించుకోవడమే నా లక్ష్యం.



## నితిన్ - సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో కొత్త సినిమా పూజా కార్యక్రమంతో ఘనంగా ప్రారంభం

ప్రముఖ కథానాయకుడు నితిన్ తదుపరి ఆసక్తికరమైన చిత్రం సాంప్రదాయ పూజా కార్యక్రమంతో అధికారికంగా ప్రారంభమైంది. నాణ్యమైన, విజయవంతమైన చిత్రాలను అందించడంలో పేరుగాంచిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రతిభావంతులైన దర్శకులు నారి సిరిసవాడ మరియు సోమశేఖర్ టి దర్శకత్వం వహిస్తున్నారు. బలమైన సృజనాత్మక బృందం ఏకమవ్వడంతో, ప్రకటనతోనే ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో నితిన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా అనిత్ మదాడి, కళా దర్శకుడిగా జానీ షేక్ వ్యవహరిస్తున్నారు. ప్రతిభావంతులైన సాంకేతిక బృందం తమ నైపుణ్యంతో దృశ్యపరంగా ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ నిర్మాణ సంస్థల కలయికలో ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు రావడంతో, ఈ సినిమాపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా చిత్రీకరణ మే రెండో వారం నుండి ప్రారంభం కానుంది. చిత్ర యూనిట్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, షూటింగ్ మొదలుపెట్టడానికి సన్నద్ధమవుతోంది.

## 'సతీ లీలావతి' ఎంతో ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది

### కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు – లావణ్య త్రిపాఠి కొణిదెల

ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మాణంలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'సతీ లీలావతి'. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య ఈ మూవీకి దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మే 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..

★ 'సతీ లీలావతి' మూవీని ఆల్రెడీ చూశాను. చాలా బాగుంది. నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇక ఆడియెన్స్ ఎలాంటి రిజల్ట్ ఇస్తారో చూడాలి. ఈ మూవీ షూటింగ్ టైంలోనే నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. కానీ టీం ఇచ్చిన సపోర్ట్‌తో షూటింగ్ సాఫీగా చేశాను.

★ ప్రతీ రోజూ షూటింగ్ అయిన తరువాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. చిత్రీకరణలో చిన్న చిన్న గాయాలు అవ్వడం అనేది కామన్ కదా. అయితే ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కి చెప్పాను. అప్పుడు నాకు ప్రెగ్నెంట్ అని తెలీదు, ఎలాంటి సింప్టమ్స్ కూడా లేవు. షూటింగ్ కూడా అంత ఈజీ కాదని అర్థమైంది. ఈ మూవీ కోసం వెయిట్ కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇకపై ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్‌లకు బ్రేక్ ఇస్తాను.

★ నేను ఈ చిత్రంలో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఇందులో ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు. నేను, నా మేనేజర్ సినిమా చూస్తూ ఫుల్లుగా నవ్వుకున్నాం. కొన్ని చోట్ల ఎమోషనల్‌గా ఉంటుంది. మంచి మెసెజ్ ఉన్నా కూడా ఏదో బోధిస్తున్నట్టుగా, క్లాస్ పీకుతున్నట్టుగా అనిపించదు.

★ 'సతీ లీలావతి'లో చూపించినట్టుగా రిలేషన్స్ బయటి ప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి కూడా ఏ మహిళకీ రాకూడదు. నాకు రియల్ లైఫ్‌లో వరుణ్ లాంటి మంచి భర్త దొరికారు. ప్రస్తుతం నేను నా భర్త, కొడుకుతో హ్యాపీగా ఉన్నాను.

★ నేను ప్రెగ్నెంట్ కదా? అని స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కాకపోతే యాక్షన్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. నేను ఫస్ట్ టైం యాక్షన్ సీక్వెన్స్ చేశాను. కాలితో కొట్టే సీన్ ఒకటి చేశాను. అప్పుడు కాస్త ఇబ్బంది అనిపించింది.

★ రామ్ చరణ్ గారు మాకు ఎప్పుడూ సపోర్టివ్‌గానే ఉంటారు. ఏమైనా హెల్ప్ చేయాలా? కావాలా? అని ఆయన అడుగుతుంటారు. మా కోసం ఆయన ట్రైలర్ రిలీజ్ చేయడం సంతోషంగా అనిపించింది. రామ్ చరణ్ రిలీజ్ చేయడంతో మాకు మరింత రీచ్ వచ్చింది.



★ దేవ్ మోహన్ గారు మంచి వ్యక్తి. ఆయన అద్భుతమైన నటుడు. ఈ మూవీ కోసం డబ్బింగ్ కూడా చెప్పారు. నేను కూడా సొంతంగా డబ్బింగ్ చెప్పాలనే ప్రయత్నిస్తున్నాను. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకోవడం ఆనందంగా ఉంటుంది.

★ చిరంజీవి గారు మా అందరినీ ఎంతో ఎంకరేజ్ చేస్తుంటారు. ఆయన్ను ప్రమోషన్స్‌కి పిలిస్తే కచ్చితంగా వస్తారు. మేం కూడా ఆయనకు ట్రైలర్ చూపించాలని అనుకుంటున్నాం.

★ ప్రస్తుతం నేను సినిమాల్ని ఒప్పుకోవడం లేదు. నేను నా ఫ్యామిలీకే టైం కేటాయించాలని అనుకుంటున్నాను. నా కొడుకుతోనే నాకు టైం సరిపోతోంది. కాస్త గ్యాప్ తీసుకోవాలని ఫిక్స్ అయ్యాను.

★ సీనియర్ యాక్టర్ నరేష్ గారు, వీటీవీ గణేష్ గారు ఇలా అందరూ అద్భుత పాత్రలు పోషించారు. చాలా ఎంటర్టైనింగ్‌గా ఈ చిత్రం ఉంటుంది. కమల్ హాసన్ గారి 'సతీ లీలావతి'తో పోల్చలేం. కానీ మా సినిమా మాత్రం వినోదాత్మకంగా సాగుతుంది. అదొక క్లాసికల్ చిత్రం. ఆ చిత్రంతో మా సినిమాని పోల్చకూడదు.

★ వరుణ్‌తో కలిసి నటించాలని నాకు కూడా ఉంది. ఈ మధ్యే ఓ కథ కూడా వచ్చింది. కానీ మేం రియల్ లైఫ్‌లో కలిసే ఉన్నాం. తెరపైనా అలానే కనిపించాలంటే కథ కాస్త కొత్తగా, డిఫరెంట్‌గా ఉండాలి. భవిష్యత్తులో అలాంటి కథ వచ్చినప్పుడు ఆలోచిస్తాం.

★ 'సతీ లీలావతి' చిత్రం ఎంతో రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. ఆడియెన్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది.

## భీమ్లా నాయక్ డైరెక్టర్ సాగర్ కె చంద్ర చేతులు మీదుగా అగ్లీ స్టోరీ ట్రైలర్ విడుదల! మే 22 న 'అగ్లీ స్టోరీ' విడుదల!

ప్రేమలోని చీకటి కోణాన్ని ధైర్యంగా చూపించే 'అగ్లీ స్టోరీ' ట్రైలర్ ఆకట్టుకునే విధంగా, తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'భీమ్లా నాయక్' డైరెక్టర్ సాగర్ కె చంద్ర చేతులు మీదుగా ట్రైలర్ విడుదల అయ్యింది. నందు, అవికా గోర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంటెన్స్ నెరేషన్, బలమైన ఎమోషన్స్, ఊహించని ట్విస్టులతో నిండిన ఈ ట్రైలర్



ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సంగీత దర్శకుడు శ్రావణ్ భరద్వాజ్ స్కోర్ ట్రైలర్‌ను మరింత ఆకర్షణీయం చేసింది. ఉత్కంఠ, ఆందోళన, ఆకర్షణ మూడింటినీ సమానంగా కలిపి రూపొందించిన ఈ ట్రైలర్ సినిమా విజయాన్ని ముందే సూచిస్తోంది. రియా జియా ప్రొడక్షన్ వాల్యూస్ చాలా అద్భుతంగా ఉండేలా సూచిస్తున్నాయి. ఈ సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్లో మూవీ టీం సినిమా ఔట్ పుట్ పై సంతోషం వ్యక్తం చేసింది. సినిమా పట్ల తమ నమ్మకాన్ని తెలియజేసింది. డైరెక్టర్ ప్రణవ స్వరూప్ మాట్లాడుతూ, "ప్రతి ప్రేమకు ఓ చీకటి వైపు ఉంటుంది. ఆ సత్యాన్ని బలంగా చెప్పడమే మా లక్ష్యం. నందు, అవికా నటన ఈ చిత్రానికి బలం చేకూర్చింది. మా ప్రొడ్యూసర్లు సుభాషిణి గారు, లక్ష్మణ్ గారు ఈ సినిమా క్వాలిటీ విషయంలో నాకు ఎంతగానో సపోర్ట్ చేశారు. కచ్చితంగా ఈ సినిమా చూసి, ప్రేక్షకులు థియేటర్లలో మంచి అనుభవం పొందుతారు" అని తెలిపారు. అలాగే ట్రైలర్ లాంచ్ చేసిన సాగర్ కె చంద్ర గారికి కృతజ్ఞతలు తెలిపారు. హీరో నందు మాట్లాడుతూ, "ఈ పాత్ర నాకు కొత్త ఛాలెంజ్. ఆసక్తికరమైన థ్రిల్లింగ్ సీన్స్‌తో నిండిన స్టోరీ ఇది. అవికా మంచి ఎమోషనల్ డెప్త్ ఇచ్చింది. డైరెక్టర్ ప్రణవ గారు ఈ సినిమాని చాలా బాగా తీశారు. ప్రొడ్యూసర్లు సుభాషిణి గారు, లక్ష్మణ్ గారు అద్భుతమైన నిర్మాణ విలువలు అందించారు. ప్రేక్షకులు ఈ సినిమాని కచ్చితంగా ఆస్వాదిస్తారు" అని తన ఉత్సాహం చూపించారు. అవికా గోర్ మాట్లాడుతూ, "ఈ చిత్రం ద్వారా ప్రేమ యొక్క వాస్తవాలను చూపించాలనుకున్నాం. ట్రైలర్ చూశాక చాలా ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన సినిమాలో అవకాశం రావడం నా అదృష్టం. డైరెక్టర్ ప్రణవ గారికి, నిర్మాతలు సుభాషిణి గారు, లక్ష్మణ్ గారికి రుణపడి ఉంటాను. మే 22న థియేటర్లలో కలుద్దాం" అని అన్నారు. అలాగే ట్రైలర్ లాంచ్ చేసిన సాగర్ కె చంద్ర గారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిర్మాతలు సుభాషిణి గారు, లక్ష్మణ్ గారు మాట్లాడుతూ.. సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. డైరెక్టర్ ప్రణవ పనితనాన్ని.. నందు, అవిక ప్రదర్శనలను ఎంతగానో మెచ్చుకున్నారు. అలాగే ఈ మూవీకి మొదటి నుంచి ఎంతో సహకారం అందించిన బెక్కం వేణు గోపాల్ గారికి, ట్రైలర్ లాంచ్ చేసిన సాగర్ కె చంద్ర గారికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాత బెక్కం వేణు గోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం టీం చాలా కష్ట పడిందని, ఈ సినిమా కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని, ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారని అన్నారు. మూవీ టీంకి తన బెస్ట్ విషెస్ తెలిపారు. సాగర్ కె చంద్ర మాట్లాడుతూ, ట్రైలర్ చాలా బాగుందని టీం ని కొనియాడారు. ఈ సినిమాని తప్పకుండా ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. మూవీ టీంకి తన బెస్ట్ విషెస్ తెలిపారు.

## సల్మాన్ మూవీలో విలన్‌గా అక్షయ్ ఖన్నా?

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా తీయనున్న విషయం తెలిసిందే. ఎస్‌విసి63' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ కండల వీరుడితో ఢీ కొట్టేందుకు



విలన్ పాత్ర కోసం ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఏమాత్రం తగ్గకుండా నటనలో ఆయనకు గట్టి పోటీ ఇచ్చే విలన్ ఉండాలని చిత్ర బృందం భావిస్తోందట. అందుకే ఈ ఇద్దరిలో ఒకరిని ఫైనల్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.



## భాగ్యశ్రీ భోర్సే బర్త్ డే సందర్భంగా 'లెనిన్' నుంచి డిఫరెంట్ పోస్టర్ విడుదల

మనం ఎంటర్‌ప్రైజెస్ LLP, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న చిత్రం 'లెనిన్'. ఈ సినిమాలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్స్ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాకి మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని జూన్ 26న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, సాంగ్స్ అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఇక తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్ బర్త్ డే సందర్భంగా ఓ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. హ్యాపీ బర్త్ డే భాగ్య శ్రీ భోర్సే అని చెబుతూ.. రాజసం ఉట్టి పడేలా కిరీటం, మీసం, డిఫరెంట్ వేషధారణతో భాగ్య శ్రీ ఉన్న లుక్‌ను రివీల్ చేశారు. ఇందులో భాగ్య శ్రీ ఆహార్యం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మరి ఈ లుక్ వెనకాల ఉన్న నేపథ్యం ఏంటి? సినిమాలో ఈ పోస్టర్‌కి ఉన్న ఇంపార్టెన్స్ ఏంటి? అన్నది త్వరలోనే తేలనుంది. ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తున్నారు. ఆయన్ మ్యూజిక్, ఆర్ఆర్ సినిమా స్థాయిని పెంచేలా ఉండబోతోంది. లియోన్ బ్రిట్టో ఈ మూవీకి కెమెరామెన్‌గా పని చేస్తుండగా.. నవీన్ నూలి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. జూన్ 26న ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380